Follow: @ANNTELUGU

27-02-2025

ANN తెలుగు

# మహా పత్రిక


గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 87 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

### ఎంపీగా అరవింద్ కేజ్రీవాల్?

- పంజాబ్ నుండి రాజ్యసభకు
- ఆప్ సంచలన నిర్ణయం



07

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచితీరాలి

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్
- కాంగ్రెస్ క్యాడర్‌కు దిశానిర్దేశ



02

### విజయ్‌ని గెలిపిస్తా..

- పాపులారిటీలో ధోనిని మించిపోతా
- ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు



02

# కేదార్.. కేటీఆర్ పార్ట్‌నర్

## రాడిసన్ డ్రగ్స్ కేసులో కేదార్ నిందితుడు

డ్రగ్స్ కేసు విచారణకు వచ్చేదశలో.. అనుమానాస్పద మరణం

ఈ మరణంపై కేటీఆర్ ఎందుకు స్పందించలేదు?

కాళేశ్వరంలో కేసులు వేసిన వారు.. వాదించేవారి మరణం వెనుకా అనుమానాలు

**కేదార్ మృతదేహం త్వరలోనే ఇండియాకు..**

**బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఒకరు దుబాయ్‌లోనే మకాం**

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కేసీఆరే కారణం.. కిషన్ రెడ్డి కేసీఆర్ పార్ట్ నర్

ఆయన అడ్డుకోవడం వల్లే మెట్రో 2 ప్రతిపాదన కేబినెట్ ముందుకు రాలేదు

బీజేపీతోనే మాకు పోటీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ లేదు

నేను ఇచ్చిన వినతులు సాధించుకొస్తే కిషన్ రెడ్డి, బండిని సన్మానిస్తా..



**ఢిల్లీ, మహా :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ అనుమానాస్పదంగా మృతి చెందితే.. కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడు అనుమానాస్పద మరణాలు చోటు చేసుకున్నాయని, కేసీఆర్ కుటుంబం మీద వచ్చిన ఆరోపణలకు వీటికి సంబంధం ఉందన్నారు. కేదార్, కాళేశ్వరం కేసులు వాదిస్తున్న న్యాయవాది సంజీవ్ రెడ్డి, కేసు వేసిన లింగమూర్తి మరణాలపై కేసీఆర్ ఎందుకు విచారణ కోరడం లేదని సీఎం ప్రశ్నించారు. త్వరలోనే డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోందన్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు వస్తే తాము విచారణ చేపడతామని తెలిపారు. కేదార్ మృతదేహం ఇండియాకు రానుందన్నారు.

మిగతా 2లో

## ప్రధాని గారూ.. ఇవి తీర్చండి

### మోదీ ముందు సీఎం రేవంత్ ఐదు డిమాండ్లు

దాదాపు గంటపాటు రాష్ట్ర ప్రగతి, పెండింగ్ అంశాలపై చర్చ

మెట్రో ఫేజ్2, ట్రిపుల్ ఆర్ సౌత్, మూసీలకు సాయం చేయాలని విన్నపం

డ్రైపోర్ట్ మంజూరుచేయాలని రిక్వెస్ట్.. ఎస్ఎల్ బిసి ప్రమాదంపై తెలుసుకున్న ప్రధాని

**ఢిల్లీ, మహా :** ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కలిశారు. ఆరుమాసాల తర్వాత ప్రధానిని కలిసిన సీఎం రేవంత్ ప్రధాని కార్యాలయం నుండి అపాయింట్‌మెంట్ ఖరారుకావడంతో ఢిల్లీకి మంత్రులు, ఉన్నతాధికారులతో వెళ్ళారు. రాష్ట్రానికి సంబంధించిన ఐదు కీలకడిమాండ్లను ప్రధాని మోదీ ముందు సీఎం ఉంచారు.

మిగతా 2లో

## సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ నివేదిక

ఢిల్లీలో సరికొత్త సన్నివేశం.. తెలంగాణ పై మోదీ వద్ద స్పెషల్ ఫైల్

ఇవన్నీ పెండింగ్ లో ఉన్నాయి.. త్వరగా కంప్లీట్ చేయాలన్న ప్రధాని

పీఎంఏవై గ్రామీణ పథకం 2016-17 నుంచి తెలంగాణలో అమలు కావడం లేదన్న మోడీ

02

## ఓం నమః శివాయ


### శివ నామస్మరణలతో మార్మోగుతున్న శైవ క్షేత్రాలు

భక్తులతో కిటకిటలాడిన దక్షిణ కాశీ వేములవాడ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాళేశ్వరం ఆలయాలు

తెలుగు రాష్ట్రాల్లో మహా శివరాత్రి వేడుకలు

**(మహా, నెట్ వర్క్):** మహా శివరాత్రి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవ క్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగాయి. శివుడిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. దక్షిణ కాశీ వేములవాడ తో పాటు శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాళేశ్వరం, కీసర తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.మహాశివరాత్రి పర్వదినాన హర హర మహాదేవ.. అంటూ నీలకంఠ స్వామిని భక్తులు కొలిచారు. వేకువజామునే ఆలయాలకు తరలివచ్చి శివయ్యను దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామునుండే ఆలయాలు కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మార్మోగాయి. శివనామ స్మరణతో రాజన్న క్షేత్రం మారు మోగుతోంది.

మిగతా 3లో



## నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఒక గ్రాడ్యుయేట్, 2 టీచర్ స్థానాలకు ఎన్నికలు
- సిట్టింగ్ స్థానంపై కాంగ్రెస్ గురి
- గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేసిన సీఎం రేవంత్
- పట్టభద్ర స్థానంలో నరేందర్ రెడ్డి, అంజిరెడ్డి, హరికృష్ణ మధ్య పోటీ.. బరిలో 56మంది
- మూడు స్థానాల్లో బిజెపి పోటీ.. బీఆర్ఎస్ దూరం
- కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ లో ఎన్నికల వాతావరణం
- పట్టభద్రుల కోసం 15 జిల్లాలలో మొత్తం 773 పోలింగ్ స్టేషన్లు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి


03

# ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి

## మరో రెండు రోజులు పట్టొచ్చు

టన్నెల్ నిపుణులందరినీ రప్పిస్తున్నాం.. ప్రతిపక్షాల తీరు బాధాకరం

ఎస్ఎల్ బీసీ టన్నెల్ తాజా పరిస్థితిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మహా :** శ్రీశైలం ఎడమ కాలువ పనుల్లో జరిగిన ప్రమాద సంఘటనలో చిక్కుకున్న ఎనిమిది మందిని రెండు రోజుల్లో సురక్షితంగా తీసుకురావడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం మరోసారి ఎస్ఎల్ బీసి ప్రమాద ఘటన స్థలంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయ కార్యక్రమాలను సమీక్షించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పార్లమెంటు సభ్యులు మల్లు రవి, శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్, జిల్లా కలెక్టర్ సంతోష్, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఏజెన్సీ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మల్లు రవితో కలిసి ఉత్తంకుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,

మిగతా 2లో

## ఉపాధి కూలీలకు రేవంత్ సర్కారు శివరాత్రి కానుక

రూ.39.74 కోట్ల ఆత్మీయ భరోసా జమ

రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు వరం

కోడ్ లేని జిల్లాల్లో అమలు



03

## సినీ నటుడు పోసాని కృష్ణ మురళి అరెస్ట్



**హైదరాబాద్, మహా:** నటుడు, మాజీ వైసీపీ నేత పోసాని కృష్ణమురళిని పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నివాసంలో ఉన్న ఆయనను రాయచోటి పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన్ను అనంతపురం తీసుకెళ్తున్నారు. అనంతపురంలో పోసానిపై కేసు నమోదు అయింది. . గతంలో పోసాని కృష్ణ మురళి వైసీపీలో పని చేసిన విషయం తెలిసిందే. అయితే వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా కొద్ది రోజులుగా వైసీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు.

## మహాకుంభమేళా మహాఘట్టం పరిసమాప్తం

**ఆఖరిరోజు 2.5 కోట్ల మంది భక్తులు**

భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం

మొత్తం 65కోట్లకు పైగా భక్తుల పుణ్యస్నానాలు



**ప్రయాగ్ రాజ్ :** 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టం బుధవారం ముగిసింది. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినంతో ముగిసింది.. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకుంభమేళాలో మహాశివరాత్రి రోజున 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.

మిగతా 2లో

# కేదార్.. కేటీఆర్ పార్ట్‌నర్

(మొదటిపేజీ తరువాయి)
ఒక మాజీ ఎమ్మెల్యే దుబాయ్‌లోనే ఉన్నారని.. అతను ఎవరు అని సీఎం ప్రశ్నించారు. ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి అనంతరం ఢిల్లీ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్‌లో 11 సంస్థలు పని చేస్తున్నాయని సీఎం చెప్పారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ఎస్ఎల్‌బీసీని వందశాతం పూర్తి చేసి తీరుతామన్నారు. కమీషన్లు రావనే ఉద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ పనులను కేసీఆర్ పక్కన పెట్టేశారని సీఎం ఆరోపించారు. ఎస్ ఎల్ బిసి ప్రమాదానికి కేసీఆరే కారణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని ఉద్ఘాటించారు. ప్రాజెక్టు పెరిగిన అంచనాలతో కలిపి రూ. 5,000 కోట్ల లోపే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ఇది పూర్తయితే మూడున్నర లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయని సీఎం వివరించారు.

**బీజేపీతోనే మాకు పోటీ**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంతా అవినీతే జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం నిపుణుల కమిటీ నివేదికల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై స్పందించిన సీఎం.. ఉప ఎన్నికలు ఎలా వస్తాయో అర్థం కావడం లేదన్నారు. 2014 నుంచి 2024 వరకు ఉన్న శాసన వ్యవస్థే ఇప్పుడూ ఉందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో ఎక్కడుందని ప్రశ్నించారు. పోటీలో లేని వారు మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ సెటైర్లు వేశారు. అధ్యక్షుడు ఎవరైనా బీజేపీతోనే తమకు పోటీ అని రేవంత్ పేర్కొన్నారు. బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పని చేస్తోందని ఆరోపించారు.

**విదేశాలనుండి రప్పించే బాధ్యత కేంద్రానిదే**

ఫోన్ టాపింగ్ అంశంలో విదేశాలలో ఉన్న వారిని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్న సీఎం.. ఈ విషయంలో కేంద్ర మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. విదేశాల్లో ఉన్న వాళ్లను ఎవరు తీసుకొస్తారో తెలియకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మెట్రోను కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకురాకుండా అడ్డుకున్నదే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డే అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను ప్రధానికి ఇచ్చిన ఐదు విజ్ఞప్తులను సాధించుకొని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ మీద ఉందన్నారు . తన వంతుగా చేయాల్సింది తాను చేశానని అవన్నీ తీసుకొచ్చి క్రెడిట్ వాళ్ల సొంతం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇది చేస్తే బహిరంగ సభ ఏర్పాటు చేసి వారికి సన్మానం కూడా చేస్తానని సీఎం ప్రకటించారు. కేంద్రానికి రాష్ట్రం నుంచి పన్నులు ఎంత కడుతున్నామో అంతే స్థాయిలో రాష్ట్రాలకు వాటా రావాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు మెట్రో తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ, నాటి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి అని గుర్తు చేశారు సీఎం.

## విలీనానికి బీఆర్ఎస్ పై బీజేపీ ఒత్తిడి

**ఫోన్ ట్యాపింగ్ కేసు హైకోర్టు మానిటరింగ్ చేస్తోందని సీఎం రేవంత్ అన్నారు. సీబీఐ కేసులు అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని బీజేపీ ఆలోచిస్తోందని ఆరోపించారు. ఫార్ములా ఈ, గొర్రెల పంపిణీ కేసులో కేసులో ఈడీ ఇన్వాల్వ్ అయిందని.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాత్రికి రాత్రి తాము ఎవరినీ అరెస్ట్ చేయబోమని.. అది తమ విధానం కూడా కాదన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ విచారణ జరుగుతోందన్నారు . రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించామన్న సీఎం రేవంత్.. తాము చేస్తున్న పనులకు ప్రచారం కల్పించుకోవడం లేదన్నారు. ఇక తన కేబినెట్‌లోని మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉందని... వారందరూ అనుభవజ్ఞులేనని పేర్కొన్నారు. వారి వారి శాఖలో సమర్థవంతంగా పని చేస్తున్నారని చెప్పారు.**

# సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ నివేదిక



**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీలో కొత్త సీన్ కనిపించింది. సాధారణంగా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలిసి తమ రాష్ట్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని, ప్రాజెక్టులు కేటాయించాలని ముఖ్యమంత్రులు ప్రధానికి విజ్ఞప్తులు చేస్తుంటారు. ఇది సర్వ సాధారణంగా జరిగేది. అయితే, ఈసారి ఢిల్లీలో అందుకు భిన్నంగా జరిగింది. హస్తినలో కొత్త సీన్ కనిపించింది. ప్రధాని మోదీ ఓ రాష్ట్ర ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చారు. ఇవన్నీ పెండింగ్ లో ఉన్నాయి, త్వరగా కంప్లీట్ చేయాలంటూ ఏకంగా ప్రధాని మోదీయే ఆ ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న అంశాలపై నివేదిక ఇచ్చారు ప్రధాని మోదీ. 2017 నుంచి 2022 వరకు తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉంటూ వస్తున్న అంశాలపై దృష్టి పెట్టాలని వాటిని పరిష్కరించాలని రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీ సూచించారు.

**పీఎంఏవై గ్రామీణ పథకం అమలు కావడం లేదు**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం 201617 నుంచి తెలంగాణలో అమలు కావడం లేదని నివేదికలో పొందుపరిచారు. ఆవాస్ 2018 మొబైల్ అప్లికేషన్ ద్వారా 2025 మార్చ్ 31 నాటికల్లా సర్వే కంప్లీట్ చేయాలని, అర్హులను గుర్తించాలని ముఖ్యమంత్రికి ప్రధాని మోడీ తెలిపారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మూడు మొబైల్ కనెక్టివిటీ ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రోడ్ల నిర్మాణం అటవీ పర్యావరణ అనుమతులు ఇవ్వాలని ప్రధాని కోరారు.

**పెండింగ్ లో మూడు నీటి పారుదల ప్రాజెక్టులు**

మూడు నీటి పారుదల ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయని, వాటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు, రివైజ్ ఎస్టిమేట్స్ పంపించాలని రేవంత్ రెడ్డికి ప్రధాన మంత్రి సూచించారు. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ స్టేజ్ 2 కింద 18,189.53 కోట్ల విలువైన పనులకు అనుమతులు పెండింగ్ లో ఉన్నాయని సీఎంకు పీఎం తెలిపారు.

బీబీనగర్ ఎయిమ్స్ కి 1365.95 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యుత్ కనెక్షన్ వాటర్ సప్లయ్ కోసం పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ప్రధాని సూచించారు. శంషాబాద్ లో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వ భూమికి పెండింగ్ లో ఉన్న 150 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని సీఎంకి సూచించారు. రెండు రైల్వే ప్రాజెక్టులు మనోహరాబాద్ కొత్తపల్లి నూతన రైల్వే లైన్, కాజీపేట విజయవాడ మూడో లైన్ విద్యుదీకరణకి సంబంధించి 3113.48 కోట్ల రూపాయలు 2020 సంవత్సరం నుంచి భూసేకరణ అటవీ అనుమతులు పెండింగ్ లో ఉన్నాయని త్వరగా క్లియర్ చేయాలని సీఎంకి సూచించారు. ప్రధాని సూచించిన పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి అధికారులతో సమీక్ష జరిపి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# ప్రధాని గారూ.. ఇవి తీర్చండి

## మోదీ ముందు సీఎం రేవంత్ ఐదు డిమాండ్లు

(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా ఈ భేటీలో ఉన్నారు. ఎస్ఎల్ బిసి ప్రమాదం పై కూడా ఈ సందర్భంగా మోదీ తెలుసుకున్నారు. కేంద్రం నుండి అవసరమైన సాయం అందిస్తామని చెప్పారు. మెట్రో రైల్ రెండో దశ, మూసీ పునరుద్ధరణకు నిధులు, గాంధీ సరోవర్ కు రక్షణ శాఖ భూముల బదలాయింపు వంటి అంశాలను ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు.

**ఇవీ విన్నపాలు**

హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్ 2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను



ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత (కనెక్టవిటీ) సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని, రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

# విజయ్‌ని గెలిపిస్తా..

## పాపులారిటీలో ధోనిని మించిపోతా

### ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు



**మహా:** తళపతి విజయ్ ను గెలిపిస్తా.. పాపులారిటీలో ధోనిని మించిపోతానంటూ ప్రముఖ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే కోసం పనిచేయనున్నట్లు అధికారికంగా ప్రకటించిన పీకే ఈమేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం మహాబలిపురంలో ఏర్పాటు చేసిన టీవీకే పార్టీ తొలి వార్షికోత్సవ సభలో మాట్లాడుతూ పీకే కీలక వ్యాఖ్యలు చేశారు . ధోనికి తమిళనాడులో సీఎస్ కే టీమ్ ద్వారా చాలా పాపులారిటీ ఉందని..తనకంటే పాపులారిటీ ఉన్న బిహారి ధోని ఒక్కడే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీవీకే విజయానికి కృషి చేస్తానని.. విజయ్ ని గెలిపించి పాపులారిటీలో ధోనిని మించిపోతానని అన్నారు పీకే. రాబోయే ఎన్నికల్లో విజయ్ ని గెలిపిస్తే.. చెన్నై సూపర్ కింగ్స్ ని గెలిపించిన ధోని పాపులర్ అవుతారా లేక విజయ్ ని గెలిపించిన పీకే పాపులర్ అవుతారా అని టీవీకే కార్యకర్తలను పీకే ప్రశ్నించారు. తమిళనాడులో ధోని కంటే పాపులర్ బీహారీ అవ్వడమే తన ముందున్న ఛాలెంజ్ అని..ధోని చెన్నై సూపర్ కింగ్స్ ని గెలిపిస్తే, తాను టీవీకే నాయకులను గెలిపిస్తానని పీకే అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచితీరాలి

## టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్.. కాంగ్రెస్ క్యాడర్‌కు దిశానిర్దేశం



**మహా, హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం పార్టీ నాయకులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నాలుగు ఉమ్మడి జిల్లాల (ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ కరీంనగర్) జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలతో జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై మండల అధ్యక్షులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలను సమాయత్తం చేయాలని మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది వ్యవధిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని.. భవిష్యత్ లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయనుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పట్టభద్రుల్లో, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో కాంగ్రెస్ పట్ల నెలకొన్న సానుకూలతను పోలింగ్ లో ఓట్లుగా మలుచుకునేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు.

# ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి

(మొదటిపేజీ తరువాయి)
టన్నెల్ నిర్మాణ రంగంలోనూ, సొరంగ మార్గంలో జరిగే ప్రమాదాలను ఎదుర్కొనడంలో అత్యంత ప్రతిభావంతమైన భారత సరిహద్దుదళం నిపుణులను పిలిపించి పరిస్థితులను సమీక్షించామని తెలిపారు. సొరంగంలో చిక్కుకున్న వారిని రెండు రోజుల్లోగా బయటికి తీయనున్నామని దీనికి సంబంధించిన కార్యాచరణ సాయంత్రమే ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత ఇంజనీరింగ్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ సహాయ చర్యలకు పూర్తిస్థాయిలో ఉపయోగిస్తున్నామని వివరించారు.

ఎస్ ఎల్ బి సి ప్రమాద సంఘటన జరిగిన మూడు గంటల్లో సంఘటనా స్థలానికి వచ్చి మంత్రుల బృందం సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించిన విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. రెస్క్యూ టీమ్స్ నిరంతరం శ్రమిస్తున్నాయన్నారు. ర్యాట్ హోల్ మైనర్ సేవలు వినియోగిస్తున్నామని, దేశంలో ఉన్న అత్యున్నత పరిజ్ఞానాన్ని, సదుపాయాలను ఉపయోగించుకుని సహాయక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. భారత సరిహద్దు రక్షణాదళం (ఇండియా బోర్డర్ ఆర్గనైజేషన్) సేవలను వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. టన్నెల్ లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తీసివేయడం, ద్వారా డీబీఎం ముందుభాగం చెరుకోనున్నట్లు తెలిపారు. డీబీఎం చివరి భాగాలను గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లతో తొలగించనున్నట్లు మంత్రి వివరించారు. అనంతరం ఆర్మీ, నేవీ, ఎన్ డీఆర్ఎఫ్, ర్యాట్ హోలర్స్ సహాయంతో వారిని వెలికి తీయనన్నట్లు ప్రకటించారు. టన్నెల్లో చిక్కుకున్న వారు ఇప్పటికీ సజీవంగా ఉన్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఈ సహాయ కార్యక్రమాలు పాల్గొని వారి భద్రతకు ఇప్పటి వరకు చాలా ప్రాధాన్యత ఇచ్చామని, వారి భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతనే ఈ రెస్క్యూ ఆపరేషన్ లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టన్నెల్ లో దాదాపు 200 మీటర్ల మేర బురద, నీరు పేరుకుపోయిందని తెలిపారు. దీనితో సహాయ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలిగిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు వచ్చిన ఆర్మీ నిపుణులు టన్నెల్లోకి వెళ్లి పరిస్థితులను పూర్తిగా అంచనా వేశారన్నారు. సహాయక చర్యలు ఇప్పటి నుంచి త్వరగా చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ప్రమాద సంఘటన జరిగిన వెంటనే, మూడు గంటల లోపు నుండే మంత్రుల బృందం నిరంతరం అధికారులకు అందుబాటులో ఉంటూ సహయక చర్యలకు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణా శాఖ స్పెషల్ సి.ఎస్. అర్వింద్ కుమార్, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషరాఫ్ అలీ, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఐజీ చౌహన్, ఎల్ అండ్ టీ టన్నెల్ రంగ నిపుణులు క్రిస్ కూపర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధి గ్రేన్ మేకర్డ్, ఉత్తరాఖండ్ లో ఇలాంటి దుర్ఘటనలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన నిపుణుల బృందం, ఆర్మీ, ఉత్తర కాశీ టన్నెల్ రెస్క్యూ ర్యాట్ మైనర్స్ గ్రూప్ ప్రతినిధి ఫిరోజ్ కురేషి, ఇతర ఉన్నతాధికారుల బృందం హాజరయ్యారు..

**ప్రతిపక్షాలపై ఆగ్రహం**

టన్నెల్ ప్రమాదాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టన్నల్ ప్రమాదాన్ని మానవీయ దృక్పదంతో చూసి బాధితులకు భరోసా కల్పించడంతో పాటు ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై సలహాలు, సూచనలను ఇవ్వాల్సిన పార్టీలు రాజకీయ కోణంతో వ్యవహరించడం బాధాకరమన్నారు. 200 మీటర్ల వరకు మట్టి, నీరు కలిసి బురద పేరుకుపోయిందని, దీని కారణంగా కొంతమేర ఆటంకం ఏర్పడింది వాస్తవమేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, నేవీ, రాట్ హోల్ మైనింగ్ సిబ్బంది సహకారంతో సిల్ట్ లోనికి వెళ్లి గల్లంతైన ఎనిమిది కార్మికుల ఆచూకీ కోసం ప్రయత్నం చేయబోతున్నామని తెలిపారు. ప్రకృతి వైపరిత్యాన్ని రాజకీయంగా లబ్ధి పొందేవారి గురించి మాట్లాడలేనని చెప్పారు. ప్రతిపక్షాలు అలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటన జరిగిన మూడు గంటల్లోనే తాను ఇక్కడికి వచ్చానని ఆరోజు నుంచి ఇప్పటి వరకు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అనుకోకుండా కొన్ని దురదృష్టకర సంఘటనలు జరుగుతాయని, అలాంటి సమయంలో అందరం బాధితుల పక్షాన నిలవడంతో పాటు ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతివాల్సిన అవసరం ఉందన్నారు. కానీ రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు.





# నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు



**కరీంనగర్, హైదరాబాద్ మహా:** పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మూడింటిలో కరీంనగర్ పట్టభద్ర నియోజకవర్గానికి అత్యధిక ఓటర్లు ఉండడంతో.. అంతటా ఆసక్తి ఏర్పడింది. మెదక్ నిజామాబాద్ కరీంనగర్ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు గురువారం జరిగే పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 3లక్షల 55 వేల 159 ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారని తెలిపారు. అన్ని జిల్లాలలో కలిపి 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని వివరించారు. 93 కామన్ పోలింగ్ స్టేషన్లు (గ్రాడ్యుయేట్స్, టీచర్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తంగా అన్ని జిల్లాల్లో 773 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

**ప్రత్యేక సెలవు**

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు తమ ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక సెలవు వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

**హోరాహోరీ**

ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికలకు గట్టి పోటీ నెలకొంది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి, బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి మధ్య గట్టి పోటీ నెలకొంది. ప్రధాన పార్టీ బీఆర్ఎస్ ఎన్నికకు దూరంగా ఉండగా, హరిక్రిష్ణ బీఎస్పీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. గట్టిపోటీ ఇస్తున్నారన్న ప్రచారం ఉంది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి సిట్టింగ్ ను నిలుపుకునేందుకు పిఆర్టీయు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ యుటిఎఫ్ సిట్టింగ్ కాగా, అంతర్గతంగా కాంగ్రెస్ మద్దతుగా నిలిచినట్లు తెలుస్తోంది. పట్టభద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్ కు సీపీఎం మద్దతుగా నిలుస్తోంది. బిజెపి మూడు స్థానాల్లో బరిలో నిలిచి ప్రచారాన్ని హోరెత్తించింది. ముఖ్యమంత్రి రేవంత్ కూడా పట్టభద్ర అభ్యర్థికి మద్దతుగా మూడు జిల్లాల్లో సభల్లో పాల్గొన్నారు.


### మహాకుంభమేళా మహాఘట్టం
## పరిసమాప్తం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళాలో ఇప్పటివరకు 65 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు యూపీ ప్రభుత్వం వెల్లడించింది..తుది లెక్కల తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్ 2025 బుధవారం నాడు గొప్ప పేష్వై ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ముగిసింది. పేష్వై ఊరేగింపులో భాగంగా, 10,000 మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. శివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. చివరిరోజున కుంభమేళాలో భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు.. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. కుంభమేళాలో భాగంగా మహా శివరాత్రి రోజు చివరి అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు.

### భారతదేశంలో
## అందరికి పెన్షన్..

**కొత్త పథకంపై కేంద్రం కసరత్తు.. త్వరలో ప్రజాభిప్రాయసేకరణ**



**మహా:** అందరికీ వర్తించేలా ఓ కొత్త పథకం తీసుకువచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. దేశంలోని ప్రజలందరికీ కొత్త పెన్షన్ పథకాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనిని 'యూనివర్సల్ పెన్షన్ స్కీమ్' అని పిలుస్తారు. వృద్ధాప్యంలో ఉన్న ప్రతి పౌరుడికి ఆర్థిక భద్రత కల్పించడం దీని లక్ష్యం. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ పథకంపై పని ప్రారంభించిందని తెలుస్తోంది. ఈ పథకం స్వచ్ఛందంగా, సహకారాత్మకంగా ఉంటుంది. ఇది ఉపాధికి సంబంధించినది కాదు. కాబట్టి ఎవరైనా దీనికి సహకరించి పెన్షన్ పొందవచ్చు. ఈ పథకాన్ని ఈపిఎఫ్ వో పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం దానిపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ కొత్త పథకంలో కొన్ని పాత పథకాలు కూడా చేర్చనున్నట్లు వర్గాల ద్వారా సమాచారం. దీని కారణంగా ఈ పథకాలు ఎక్కువ మందిని ఆకర్షిస్తాయి. అలాగే, అన్ని వర్గాల ప్రజలు దీని ప్రయోజనాన్ని పొందుతారు. అసంఘటిత రంగ కార్మికులు, వ్యాపారవేత్తలు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు కూడా ఈ పథకం ప్రయోజనాన్ని పొందాలని ప్రభుత్వం కోరుకుంటోంది. 18 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఎవరైనా పాల్గొనవచ్చు. అతనికి 60 సంవత్సరాల వయస్సు తర్వాత పెన్షన్ లభిస్తుంది. ఈ నేపథ్యంలో పౌరులందరికీ ఒకటే తరహా పెన్షన్ పథకం తీసుకురావాలని కేంద్ర సర్కార్ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న పొదుపు, పింఛను పథకాలను హేతుబద్ధీకరించి ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యోగం చేస్తున్న వారితో పాటు ఉద్యోగంలో లేనివారు సైతం ఈ పథకంలో చేరేలా ప్రయత్నాలు చేస్తోంది. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ప్రారంభమైందని, త్వరలోనే దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని అధికారి ఒకరు వెల్లడించారు.

**ఉన్న పథకాలన్నీ కలిపేసి..**

ప్రధాన్ మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారి కోసం జాతీయ పెన్షన్ పథకం లను ఈ కొత్త పథకంలో విలీనం చేయవచ్చు. ఈ రెండు పథకాలు స్వచ్ఛందమైనవి. వీటిలో 60 సంవత్సరాల తర్వాత ప్రతి నెలా రూ.3,000 పెన్షన్ పొందుతారు. దీని కోసం మీరు ప్రతి నెలా రూ.55 నుండి రూ.200 వరకు డిపాజిట్ చేయాలి. ఈ మొత్తం మీ వయస్సు మీద ఆధారపడి ఉంటుందని గుర్తించుకోవాలి. మీరు డిపాజిట్ చేసినంత డబ్బును ప్రభుత్వం కూడా అందులో జమ చేస్తుంది.

### ఎంపీ స్థానాల పునర్విభజనపై
## అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**దక్షిణాది స్థానాలు తగ్గవు..**
**పెరిగే అవకాశం ఉంది**

**మహా:** దేశవ్యాప్తంగా జరగనున్న లోక్‌సభ నియోజవర్గాల పునర్విభజన ప్రక్రియ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం తమిళనాడులోని కోయంబత్తూరులో అమిత్ షా మాట్లాడుతూ.. పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరగదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో దక్షిణాదిలోని ఏ రాష్ట్రం ఒక్క లోక్‌సభ స్థానాన్ని సైతం కోల్పోయే అవకాశమే లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా దక్షిణాదిలో లోక్ సభ స్థానాలు పెరిగే అవకాశం ఉందన్నారు. దక్షిణాది ప్రజల ఆంకాక్షలను ప్రధాని మోదీ.. తన మనస్సులో పెట్టుకున్నారని తెలిపారు. లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రకారం.. దక్షిణాదిలోని ఏ రాష్ట్రంలోనూ ఒక్క స్థానాన్ని కూడా తగ్గించమని లోక్‌సభ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారని ఈ సందర్భంగా మంత్రి అమిత్ షా గుర్తు చేశారు. తాను సైతం దక్షిణ భారతదేశ ప్రజలకు ఇదే భరోసా ఇవ్వాలనుకుంటున్నానని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయమైన వాటా లభిస్తుందని.. అందులో ఏ మాత్రం సందేహమే లేదన్నారు. పునర్విభజన ప్రక్రియలో తమిళనాడు రాష్ట్రం 8 లోక్‌సభ స్థానాలను కోల్పోనుందంటూ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ వెల్లడించారు. ప్రస్తుతం.. తమిళనాడులో 39 లోక్‌సభ సీట్లు ఉన్నాయని.. కానీ పునర్విభజన ప్రక్రియలో భాగంగా వాటి సంఖ్యను 31కి తగ్గించే అవకాశం ఉందన్నారు. ఇది కేవలం స్థానాల సంఖ్య తగ్గింపు మాత్రమే కాదని.. ఇది మన హక్కుల గురించని ఆయన స్పష్టం చేశారు. పునర్విభజన పేరుతో తమిళనాడు గొంతును అణచివేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలకు అతీతంగా అందరూ కలిసి వచ్చి మన గొంతుకను వినిపించాలని అఖిల పక్షానికి పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో మార్చి 5వ తేదీన చెన్నైలో ఈ అంశంపై చర్చించేందుకు అఖిల పక్ష సమావేశాన్ని సీఎం స్టాలిన్ ఏర్పాటు చేశారు. అయితే సీఎం స్టాలిన్ ఈ ప్రకటన చేసిన మరునాడే.. కేంద్ర మంత్రి అమిత్ షా కోయంబత్తురులో పునర్విభజన ప్రక్రియపై ఈ వ్యాఖ్యలు చేశారు.



## ఉపాధి కూలీలకు రేవంత్ సర్కారు శివరాత్రి కానుక

**రూ.39.74 కోట్ల ఆత్మీయ భరోసా జమ**


**రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు వరం**
**కోడ్ లేని జిల్లాల్లో అమలు**

**మహా, హైదరాబాద్:** మహా శివరాత్రి వేళ రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో నిధులు జమ అయ్యాయి. ఎన్నికల కోడ్ ముగియగానే మిగతా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ కానున్నాయి. మొత్తం 18,180 మందికి రూ.6 వేల చొప్పున జమ చేసింది. ఆ రెండు జిల్లాల్లో 66, 240 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరి ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ చేశారు. ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లు చెల్లింపు చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే మిగతా లబ్ధిదారులందరికీ నిధులు డిబిటి పద్ధతిలో కూలీల ఖాతాల్లోకి నేరుగా చేరనున్నాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించింది ప్రభుత్వం. ప్రతి మండలంలో ఓ గ్రామాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంది. గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో నిధులు జమ చేసింది ప్రభుత్వం.

### భారత ఫార్మా రంగంలో
# తెలంగాణది కీలక పాత్ర

## ప్రపంచ ఫార్మసీ హబ్ గా హైదరాబాద్

ఫార్మా ఆదాయంలో 35 శాతం, బల్క్ డ్రగ్స్ లో 40 శాతం ఆదాయం భాగ్యనగరానిదే
హైదరాబాద్ కేంద్రంగా 800 ఫార్మా, బయోటెక్, మెడిటెక్ కంపెనీలు
బయో ఆసియా ముగింపు సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** భారత ఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తున్నదని, దేశంలోని ఫార్మా ఆదాయంలో 35 శాతం, బల్క్ డ్రగ్స్ లో 40 శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ముత్యాల నగరంగానే కాకుండా, ప్రపంచ ఫార్మసీ హబ్‌గా ఖ్యాతికెక్కిందని ఆయన ప్రశంసించారు. 22వ ఎడిషన్ బయో ఆసియా2025 లాంటి గ్లోబల్ ఈవెంట్స్ హైదరాబాద్ నగర వేదికగా జరగడం, హెల్త్‌కేర్ రంగంలోని సాంకేతికత, సుస్థిరమైన పద్ధతుల గురించి చర్చించడం చాలా సంతోషంగా ఉందన్నారు. లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో భారతదేశం విశేషమైన పురోగతి సాధిస్తోందని, డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మందులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20 శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నామని, పదేళ్లలో భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయిందని వివరించారు. 2014లో 15 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కాగా, 2024లో ఇది 27.85 బిలియన్ డాలర్లకు పెరిగిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భారత్‌లో ఫార్మా ఉత్పత్తులతోపాటు వివిధ రంగాల్లోనూ ఎగుమతులు పెరిగాయని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంపై కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతున్న కారణంగానే ఈ మార్పులు సాధ్యమవుతున్నాయని వివరించారు. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో దేశంలో వస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా భారతదేశం ఇటీవలే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులోనే మూడో స్థానానికి ఎగబాకుందనే విశ్వాసం మాకుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ దూరదృష్టి ఫలితంగా రక్షణ రంగంలో దిగుమతులు చేసుకునే పరిస్థితి నుంచి టాప్ 25 ఎగుమతుల దేశాల జాబితాలో చేరామన్నారు. 2014లో ఒక్క మొబైల్‌ఫోన్ కూడా ఎగుమతి చేయలేని పరిస్థితి నుంచి ఇప్పుడు రూ. 1.28 లక్షల కోట్ల విలువైన మొబైల్‌ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, 2030 నాటికి ఏకంగా 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామన్నారు. 2047కల్లా భారత్ 18 వేల డాలర్ల తలసరి ఆదాయంతో 30 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, ప్రధానమంత్రి విజన్, వేగంగా సమర్థవంతంగా పథకాల అమలు, యువశక్తి సామర్థ్యం, వివిధ రంగాల్లో నిపుణులు, పారిశ్రామికవేత్తలందరి కృషికారణంగానే ప్రగతి సాధిస్తున్నామన్నారు.

**బల్క్ డ్రగ్ క్యాపిటల్**

హైదరాబాద్ నగరం 'బల్క్ డ్రగ్ క్యాపిటల్', 'వ్యాక్సిన్ క్యాపిటల్'గా పురోగతి సాధించిందని, అలాగే ఐటీ ఎగుమతుల్లో లీడర్‌గా నిలిచిందని వివరించారు. 2024లో భాగ్యనగరంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా రూ.1.2 లక్షల కోట్ల ఐటీ సేవలు ఎగుమతులు జరిగాయని, నరేంద్రమోదీ నేతృత్వంలో అంతర్జాతీయంగా పరిశోధనలు, ఏఐ హెల్త్ కేర్, తయారీ రంగంలో ఎంతో వృద్ధి చెందుతూ 'వసుధైవ కుటుంబకం' భావనకు ప్రతిబింబంగా భారత్ నిలుస్తోందన్నారు. భారత్ ఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35 శాతం, బల్క్ డ్రగ్స్ లో 40 శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తోందన్నారు. 800 ఫార్మా, బయోటెక్, మెడిటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని, హైదరాబాద్‌లో ఐఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (నైపర్), సీసీఎంబీ, ఐఎస్‌బీ, నల్సార్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి టాలెంటెడ్ యువకులు ఆయా రంగాల్లో సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మా సిటీ, మెడికల్ డివైజెస్ పార్కు వంటివి విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, 2047 నాటికి 500 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఎకానమీ సృష్టి దిశగా అడుగులు వేసే అవకాశాలు హైదరాబాద్ లో మెండుగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ రంగానికి ఊతమిచ్చేందుకు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మెడ్‌టెక్ మిత్ర' వంటి వేదికలు ఆవిష్కర్తలకు, స్టార్టప్స్, భాగస్వామ్యపక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతున్నాయని చెప్పారు. గ్లోబల్ హెల్త్‌కేర్ రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ఇన్నొవేటర్లు, శాస్త్రవేత్తలు భారత్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కిషన్ రెడ్డి కోరారు. అందరం కలిసి హెల్త్‌కేర్ రంగాన్ని మరింతగా తీర్చిదిద్దుదామన్నారు.

## ఓం నమ: శివాయ

మొదటిపేజీ తరువాయి

ఓం నమశ్శివాయతో దక్షిణ కాశీ వేములవాడ మార్మోగింది. సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరయ్యారు. వేములవాడ రాజన్న క్షేత్రం భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోతోంది. భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి.. దర్శనానికి క్యూ లైన్లో బారులు తీరారు. కాళేశ్వరం క్షేత్రంలో మహాశివరాత్రి శోభ కనిపించింది. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న మహరాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు కాళేశ్వరంకు తరలివచ్చారు. త్రివేణి సంగమ గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించి.. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మారేడు దళాలు సమర్పించి.. అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ దక్షిణకాశీగా పేరొందిన ప్రసిద్ద శైవ క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ వేడుకల్లో పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు కూడా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మధిర పట్టణంలోని శివాలయంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీసమేతంగా పూజలు నిర్వహించి స్వామి వారికి అభిషేకం చేయించారు. మహాశివరాత్రి సందర్భంగా కీసరలో శ్రీ రామలింగేశ్వర స్వామిని జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డి దర్శించుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా నార్కట్ పల్లి మండలం చెర్వుగట్టు దేవస్థానం శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా, కురవి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారిని మాజీ మంత్రి, శాసనమండలి బి.ఆర్.ఎస్ పార్టీ విప్ సత్యవతి రాథోడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మణుగూరులో నీలకంఠేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు మేళ్ళచెరువు లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**భక్తుల పుణ్యస్నానాలు**


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మంచిర్యాల జిల్లా కేంద్రం, గూడెం, లక్సెట్టిపేట, చెన్నూరు గోదావరి నది తీరాల్లో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు. వేలాల మల్లిఖార్జున స్వామి ఆలయం, కత్తరశాల మల్లన్న, బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. నిర్మల్ జిల్లా బాసరలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. సోన్, ఖానాపూర్ గోదావరి నది తీరాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కొమురం భీం జిల్లా ఈజ్‌గాం శివ మల్లన్న, వాంకిడి శివ కేశవ ఆలయాల్లో వైభవంగా మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదిలాబాద్, పెన్ గంగా నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. జిల్లా కేంద్రంలోని శివాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

**ఖమ్మం జిల్లాలోనూ..**

మహా శివరాత్రి సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఆలయాలు శివనామ స్మరణతో మారుమోగుతున్నాయి. కూసుమంచి గణపేశ్వరాలయం, ఖమ్మం రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వర ఆలయం, పెనుబల్లి మండలం నీలాద్రీశ్వరస్వామి ఆలయం, మధిర మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, స్నానాల లక్ష్మీ పురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయాలలో మహా శివునికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహా శివుని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురామిరెడ్డి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం కోమటిరెడ్డి పూజలు**


**నాగర్‌కర్నూలు, మహా:** ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. మూడు రోజులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దోమలపెంటలోనే ఉండి మరీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఈరోజు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా టన్నెల్ చిక్కుకున్న వారి క్షేమం కోసం మంత్రి శ్రీశైలం వెళ్లారు. బుధవారం ఉదయం దోమలపెంట నుంచి శ్రీశైలం మహాపుణ్యక్షేత్రానికి వెళ్లారు సీఎం. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది సురక్షితంగా తిరిగిరావాలని శ్రీశైలంలో ప్రత్యేక పూజలు చేయించారు.



EDITORIAL సంపాదకీయం

# కృత్రిమ మేధ వినియోగం సాధ్యమేనా!?

**ఈ కృత్రిమ మేధ అనే ప్రక్రియ సమాజానికి లాభమా?నష్టమా??అనే విషయానికి వస్తే.. శాస్త్ర జ్ఞానం అనబడే కత్తికి ఏవిధంగా అభివృద్ధి,వినాశం అనే రెండంచులు ఉంటాయో దీనికి అదే వర్తిస్తుంది. మన విచక్షణ లోనే కృత్రిమ మేధ వాడకం ఉండాలి.**




ఇప్పుడు ప్రపంచం దృష్టి కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇన్టిలిజెన్స్)కొత్త డిజిటల్ టెక్నాలజీ వైపు పరుగులు తీస్తోంది.కృత్రిమ మేధ అంటే మెదడుకు మేతలా ఉపయోగపడే ఒక విధానాన్ని గుర్తింప జేసే ప్రక్రియ (ప్యాటన్ రికగ్నైజేషన్ సిస్టమ్) అనవచ్చు. కృత్రిమ మేధ డిజిటల్ ప్రక్రియకు యంత్రాలను సిద్ధం చేసేపని మరలా మనిషిమేధస్సు చేయవలసిందే! ఇప్పటికే చైనా డీప్ సీక్ పేరుతో, అమెరికా ఏఐ పేరుతో ఈ రంగంలో ముందుకు వెళుతున్నాయి. టెక్నాలజీ వరకు ఏదేశమైనా వినియోగించవచ్చుకానీ, కృత్రిమ మేధను యంత్రం అర్థం చేసుకునే లా శిక్షణ ఇవ్వాలంటే ఆదేశ చరిత్ర, సంస్కృతి,బాషా ఇత్యాది అంశాలన్నింటినీ యంత్ర సంసిద్దతకు అందించాల్సి ఉంటుంది. కృత్రిమ మేధకు ఇది ప్రధానప్రక్రియ. చైనాలో కన్ఫ్యూజియస్ తాత్వికత, అమెరికాలో వలసనేపద్యం తదితర మాల్ మసాలాలతో అక్కడ కృత్రిమ మేధ డిజిటల్ యంత్రం డిజైన్ చేసుకుంటుంది.మనదేశంలో అయితే 22అధికారబాషలు,461 అనధికారబాషలు, చిన్నాచితకా 1600బాషలు,ఇక సంస్కృతి విషయంకు వస్తే వేద సంస్కృతి లో భాగమైన యజుర్వేదం,సామవేదం, రుగ్వేదం,అందర్వణ వేదాలతోపాటు,బారతం, రామాయణం,భక్తిఉద్యమం, ఆదునిక సాహిత్యం, భరతనాట్యం,కథాకళీ,తిరునక్కరాల్ తదితర నృత్య రీతులు,శాస్త్రీయ సంగీతం, ఇక సింధూనాగరికథ, హిందూ యిజం,బుద్ధిజం, జైనిజం , గణితం, ఆస్ట్రాలజీ,మెటబాలిజం, రాజకీయ పరిణామాలు,పరిపాలన విదానాలు, చట్టాలు,చట్టుబండలు ఇత్యాది సారాంశం అంతా ముందు మనం డిజిటల్ కృత్రిమ మేధస్సు రూపకల్పనకు ఫీడ్ చేయాలసి ఉంటుంది.ముఖ్యంగా మన విబిన్న మైన చరిత్ర, సంస్కృతి,బాషా, భావజాలం,బావోద్రేకతలు,శరీరక తత్వం,శిల్ప, చిత్ర ,నాట్య కళలు ఇత్యాది అంశాలన్నీఅందజేయాల్సి ఉంటుంది.ఇన్నిజాతులు,ఉపజాతులు,మతాలు, కులాల,భాష, సంస్కృతి వైవిధ్యభరితమైన ఈ దేశం లో మనకృత్రిమ మేధాకు ఇంత సంసిద్ధత మనం పొందుపరిచగలమా?సందేహమే? ఒకవేళ మనం ఇతరదేశాల కృత్రిమ మేధ వాడితే మనకు ఫలితాలు పూర్తి విశ్వసనీయంగా, ఖచ్చితంగా వచ్చే అవకాశం ఉంటుందా? ఉండదు గాక ఉండదు?

ఈ కృత్రిమ మేధ అనే ప్రక్రియ సమాజానికి లాభమా? నష్టమా??అనే విషయానికి వస్తే.. శాస్త్ర జ్ఞానం అనబడే కత్తికి ఏవిదంగా అభివృద్ధి,వినాశం అనే రెండంచులు ఉంటాయో దీనికి అదే వర్తిస్తుంది. మన విచక్షణ లోనే కృత్రిమ మేధ వాడకం ఉండాలి. దీనికీ అంతే అవకాశాలు పరిధి కూడా ఉంటుంది.ఒక వేళ మనదేశం అవసరాలకు తగ్గ కృత్రిమ మేధ డిజిటలైజేషన్ అయి ఉపయోగంలోకి వస్తే కొన్ని ఉద్యోగావకాశాలు సన్నగిల్లే అవకాశం ఎక్కువగానే ఉంటుంది.

> “ విద్యారంగంలో కృత్రిమ మేధను ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉంది.తరగతి బోదనలో వినూత్న అవకాశాలు తోపాటు విద్యార్థులు తమవ్యక్తిగత అభ్యసన స్థాయిలు పెంపొందించుకోవడంలో బాగా ఉపయోగం ఉంది. ఇకపోతే ఇప్పుడు ఉన్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ లో విద్యార్థులకు నిష్పాక్షికంగా గ్రేడ్లు ఇవ్వడంలో ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉంటుంది.ఇకపోతే ఒక విద్యార్థి విద్యాభ్యసన స్థాయి అంచనా వేయడంతో పాటు, వెనుక బడిన విద్యా సామర్థ్యాలు ఖచ్చితంగా సిఫార్సు చేయగల నైపుణ్యం కృత్రిమ మేధకు నూటికి నూరు శాతం ఉంటుంది.

> “ కృత్రిమ మేధ వైద్య రంగంలో విప్లవాత్మకమైన సంచలనాలు కలిగించే అవకాశం ఉంది. దీనిఫలితంగా ఆస్పత్రులసంఖ్య, డాక్టర్ల సంఖ్య తగ్గడంతో పాటు వైద్యరంగంలో నిర్లక్ష్యంకు, నిర్లిప్తత కు తావులేని ఖచ్చిత తత్వం అందిస్తుంది.

పెరుగుతున్న నిరుద్యోగ పెనుభూతం రీత్యా చూసినప్పుడు అవసరం అయిన రంగాల్లో వాడితేనే మంచిది. ఉదాహరణకు కృత్రిమ మేధతో నడిచే కారు మార్కెట్లోకి వస్తే లక్షలాది డ్రైవర్ ఉద్యోగాలు,వేలాది యాక్టింగ్ డ్రైవర్లు జీవనోపాధి సంగతి ఏమిటి? ఖచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేసి,మందులు ప్రిస్క్రిప్షన్ నూటికి నూరు శాతం విశ్వనీయత తో యంత్రం రాసినప్పుడు కోట్లాది రూపాయలు ధారపోసి తయారు చేసిన ఆస్పత్రులు ,డాక్టర్ల సామర్థ్యం ఏం కావాలి? అంతేకాదు, మొత్తం దేశ సమాచారం పొందుపరిచిన యంత్రాలు వలన మన సమాచార పైరసీ సమస్య తల ఎత్తే అవకాశం పాళ్ళు ఒకింత ఎక్కువే. ఇత్యాది ప్రశ్నలు,సంశయాలు అనేకం తల ఎత్తవచ్చును. ఇక పోతే మనదేశంలో కృత్రిమ మేధ వినియోగం సాధ్యాసాధ్యాలు లోనికి వెళదాం. మనది వ్యవసాయ దేశం కనుక పంట పండించడం,భూసార పరీక్షలు, రసాయనిక ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం,పంటనూర్పిడిలో ఈ టెక్నాలజీ తోడ్పడుతుంది. అయితే శాటిలైట్ సిస్టం ద్వారా కృత్రిమ మేధ ఈ రంగాన్ని మానిటరింగ్ చేయాలంటే చిన్న భూకమతాలు, విభిన్న భౌగోళిక రూపాలు ఉన్న మనదేశంలో ఇది సాధ్యమా?అనే అనుమానం లేకపోలేదు.ఇక ట్రాన్స్పోర్ట్ రంగంలో అయితే కృత్రిమ మేధతో నడిచే ట్రక్కులు,కార్లు, సిగ్నలింగ్ సిస్టం ఏర్పాట్లు తదితరాలు ఇది ఈరంగంలో కొంతమేర ఉపయోగం ఉంటుంది. ఇక విద్యారంగంలో కృత్రిమ మేధను ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉంది.తరగతి బోదనలో వినూత్న అవకాశాలు తోపాటు విద్యార్థులు తమవ్యక్తిగత అభ్యసన స్థాయిలు పెంపొందించుకోవడంలో బాగా ఉపయోగం ఉంది. ఇకపోతే ఇప్పుడు ఉన్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ లో విద్యార్థులకు నిష్పాక్షికంగా గ్రేడ్లు ఇవ్వడంలో ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉంటుంది.ఇకపోతే ఒక విద్యార్థి విద్యాభ్యసన స్థాయి అంచనా వేయడంతో పాటు, వెనుక బడిన విద్యా సామర్థ్యాలు ఖచ్చితంగా సిఫార్సు చేయగల నైపుణ్యం కృత్రిమ మేధాకు నూటికి నూరు శాతం ఉంటుంది. పక్షపాత యుక్తమైన గ్రేడ్లకు చెక్ పెట్టే అవకాశం ఉంది.విద్యార్థి, ఉపాద్యాయ శిక్షణ లో తోడ్పడంతోపాటు ఖచ్చితమైన విద్యా గణాంకాలు రూపకల్పన చేస్తుంది.పారిశ్రామిక రంగంలోనైతే ఉత్పత్తి ప్రక్రియ,యంత్రాల క్వాలిటీ తదితరాలను మానెటరింగ్ చేసే అవకాశం ఉంది.పారిశ్రామికీకరణలో ఎక్కువ స్థాయిలో ఈ కృత్రిమ మేధాశక్తిని వాడడం మనదేశానికి అంతమంచిది కాదు? మానవవనరులు అపారంగా ఉన్న మనదేశంలో నిరుద్యోగితకు తావు లేకుండా ఉచితానుచితాలు ఆలోచించి ఈ ప్రక్రియ వినియోగం లోకి అనుమతించాలని ఉంటుంది.ఇక ఈ కృత్రిమ మేధ వైద్య రంగం,మందుల వినియోగం లో విప్లవాత్మకమైన మార్పులు తెస్తుంది. ఒకరోగి రోగాన్ని నిర్ధారణ చేసే విషయం నుండి ఆరోగివాడాల్సిన మందులు ప్రిస్క్రిప్షన్,వ్యక్తియొక్క వ్యక్తిగత స్థితి నుంచి బేరీజు వేసి మందులు సూచిస్తుంది.నూతన మందులు పరిశోధన తోపాటు,డాక్టర్లు చేసే సర్జరీ తర్వాత పేషెంట్ కోలుకునే సమయం ఖచ్చితంగా నిర్ధారిస్తుంది. కృత్రిమ మేధ వైద్య రంగంలో విప్లవాత్మకమైన సంచలనాలు కలిగించే అవకాశం ఉంది. దీనిఫలితంగా ఆస్పత్రులసంఖ్య, డాక్టర్ల సంఖ్య తగ్గడంతో పాటు వైద్యరంగంలో నిర్లక్ష్యంకు, నిర్లిప్తత కు తావులేని ఖచ్చిత తత్వం అందిస్తుంది.మనిషి యొక్క ఇమ్యూనిటీ సిస్టం అంచనావేసి ఆరోగ్య పరిరక్షణలో కీలక భూమికనే ఈ కృత్రిమ మేధ నిర్వర్తించనుంది. మార్కెట్ రంగాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ ను నియంత్రిస్తుంది. బ్యాంకులు, ఆడిటింగ్, ట్యాక్స్ కనసల్టేటింగ్ పనిని కృత్రిమ మేధ చాలా వరకు నిక్కచ్చిగా రాయగలుగుతుంది.



ఎన్.తిర్మల్, సీనియర్ జర్నలిస్టు
సెల్:9441864514,

**మనదేశం జనాభా లో ప్రపంచం లోనే ప్రధమ స్థానంలోకి చేరుకుంటున్నందున ఈఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏమేరకు,ఏఏ రంగాల్లో వినియోగించాలనే విచక్షణ జ్ఞానం ఇప్పుడు మనకు ముఖ్యమైన అంశం**

ఈకృత్రిమమేధ సంసిద్ధం అయితే రాజకీయ రంగంలో ఇకవ్యూహకర్తల అవసరమే ఉండదు. ఆయా ఓటర్ల ప్రవర్తనా విశ్లేషణ తో వారేం కోరుకుంటున్నారు. ఎన్నికలక్యాంపెయిన్ ఎలా ఉండాలి. ఎన్నికలఫలితాలు ఎలా ఉండబోతున్నాయి? ఇత్యాది విషయాలన్నీ ఈ కృత్రిమ మేధ ద్వారా రాజకీయ నాయకులు, పార్టీలకు సౌలభ్యత చేకూరుతుంది. ఏదేశానికి ఆదేశం రక్షణ రంగం, ఆధునిక యుద్ధాల లో, వినాశం లో కూడా కృత్రిమ మేధ ప్రముఖ స్థానం ఆక్రమించే సాంకేతిక ప్రాధాన్యత దీనిలో కనిపిస్తుంది. ఇకపోతే ఒక పావు శతాబ్ది పాటు మానవ సమాజాన్ని కంప్యూటర్ యుగం ప్రభావితం చేస్తే ఇకముందు సమాజంలో కృత్రిమ మేధ డిజిటల్ విద్య ప్రాధాన్యత పెరిగే అవకాశం స్పష్టంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలోని కోట్లాది మంది విద్యార్థులు ఈ కృత్రిమ మేధో విద్య పట్ల ఆసక్తి కనపర్చుతున్నారు.ఇకనుండి ఒకదేశం యొక్క అబివృద్ధి సూచికలో కూడా కృత్రిమ మేధ యొక్క వాడకం స్థితి పేరామీటరుగా చేరినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు! అయితే, ఏదేశానికి ఆదేశం దీని ప్రాధాన్యత గమనిస్తూ ముందుకు పోతున్న స్థితిలో,ముఖ్యంగా మనదేశం జనాభా లో ప్రపంచం లోనే ప్రధమ స్థానంలోకి చేరుకుంటున్నందున ఈఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏమేరకు,ఏఏ రంగాల్లో వినియోగించాలనే విచక్షణ జ్ఞానం ఇప్పుడు మనకు ముఖ్యమైన అంశం!?

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# ఎవరు ఎవర్ని ఖతం చేయగలరు?


దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత 'ఖతం' అనే మాట మళ్ళీ వినబడుతోంది.అప్పట్లో సిపిఐ ఎంఎల్ నిర్మాత చారుమజుందార్ రూపొందించిన 'వర్గశత్రునిర్మూలన' లో భాగంగా శ్రీకాకుళంలో భూస్వాములను నక్సలైట్లు హత్యలు చేసేవారు. కాలక్రమంలో ఆ 'కార్యక్రమాన్ని' నక్సలైట్ పార్టీలు రద్దు చేసుకున్నాయి.ప్రజాబలంతోనే విప్లవోద్యమం చేయాలని ఆ పార్టీలు సంకల్పించాయి.సీన్ కట్ చేస్తే తమ 'పార్టీని ఖతం' చేయడానికి కాంగ్రెస్,బిజెపి కుట్ర చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించడంతో 'ఖతం' కార్యక్రమం చర్చకు వస్తున్నది.అయితే నక్సలైట్లు పాటించిన 'ఖతం' కార్యక్రమం వేరు.కేటీఆర్ చెబుతున్న 'ఖతం' వేరు.నిజానికి తెలంగాణలో రాజకీయపార్టీలను 'ఖతం'చేసే కార్యక్రమానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారు.మరో పార్టీ లేకుండా చేయాలన్నది ఆయన స్కీమ్.అదే పని బిజెపి లేదా కాంగ్రెస్ పార్టీలు చేసేందుకు ప్రయత్నించడం మాత్రం 'నేరం'గా మారుతోంది.

''తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ రక్షణ కవచంలా మారింది.కేసీఆర్ పార్టీని ఖతం చేయడానికే కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి''. అని ఫిబ్రవరి 25 న స్టేషన్ ఘన్‌పూర్ పార్టీ కార్యకర్తలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.''మంత్రి పొంగులేటిపై ఈడీ రెయిడ్ చేసింది.దానిపై ఇంతవరకు ఎవరూ నోరు విప్పడం లేదు..ఎవరిని ఎవరు కాపాడుతున్నారో ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.రేవంత్ రెడ్డి బీజేపీపై మాట్లాడటం లేదు.కేసీఆర్ మీదనే ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం చేసుకోవాలి. తెలంగాణలో కేసీఆర్ పార్టీ ఉంటే కాంగ్రెస్, బీజేపీ ఆటలు సాగవని తెలుసు కాబట్టే ఆ ఇద్దరు కలిసి కేసీఆర్ పార్టీని ఖతం చేయాలని చూస్తున్నారు''. అని కూడా ఆయన వివరించారు.

'కేసీఆర్ పార్టీని ఖతం చేయాలని ఎవరు ప్రయత్నించినా అది ఎలా సఫలమవుతుంది'?తెలంగాణ సామాజిక,రాజకీయ,ఆర్థిక రంగాల అభివృద్ధికి గాను చారిత్రిక అవసరంగా టిఆర్ఎస్ జన్మించినట్టు కేసీఆర్ పదే పదే చెబుతుంటారు.ఇటీవలి పార్టీ కార్యవర్గ సమావేశంలోనూ ఇదే మాట అన్నారు.'చారిత్రిక అవసరం'దృష్ట్యా పార్టీ ఆవిర్భవించినపుడు,దాన్ని 'ఖతం' చేయడం ఎలా సంభవం?

'ఇక నుంచి ఫక్తు రాజకీయపార్టీ' అని ఉద్యమపార్టీ దిశను మార్చినపుడే ఆ పార్టీలో 'పతనపు' లక్షణాలకు పునాదులు పడ్డాయని కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు వంటి నాయకులంతా ఉద్దేశపూర్వకంగా మర్చిపోతున్న సంగతి.'ఉద్యమపార్టీ'స్వరూపం మారడమే,అన్ని అవలక్షణాలకు కారణం.

ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం,ఆయా పార్టీలను నిర్వీర్యం చేయడం,బలహీనపరచడం,ఒకానొక దశలో కాంగ్రెస్,టిడిపి,బిజెపి తదితర పార్టీలన్నింటినీ 'ఖతం' చేయాలనుకోవడం కేసీఆర్ కు మాత్రమే చెల్లింది.దేశంలోని వేరే ఏ రాష్ట్రాల్లోనూ ఏ ప్రాంతీయ పార్టీ ఇలాంటి పోకడలకు పోలేదు.రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరచే చర్యలు వేరు.అసలు వాళ్ళెవరూ 'తెలంగాణ మైదానంలో'నే ఉండరాదని ప్రయత్నించడం వేరు.ఇది ముమ్మాటికీ కేసీఆర్ 'తన పతనాన్ని తానే కోరుకోవడం' కాదా? 'తమ గొయ్యి తామే తవ్వుకున్నట్లు' కాదా? సమస్య ఏమిటంటే కేసీఆర్ కు ఎవరూ సలహాలు ఇవ్వలేరు.ఆయన ఎవరి సలహాలూ తీసుకోరు.తనకు తాను మహా జ్ఞానిగా అనుకోవడమే ఆయన కొంప ముంచుతోంది.



''మీరు కేంద్రీకృత నాయకత్వ శైలితో పనిచేస్తున్నారు.అన్ని అధికారాలు మీ వద్దే ఉంటాయి.ఇది న్యాయమా''? అని ఒక ఆంగ్ల వెబ్ సైట్ విలేకరి 2023 నవంబర్ లో ప్రశ్నించినపుడు,''అవును ,కేంద్రీకృత నాయకత్వమే కావాలి. తెలంగాణ వ్యవస్థాపకుడిగా,రాష్ట్ర అవసరాలు నాకు తెలుసు. నేను కీలక అంశాలపై నిర్ణయం తీసుకుంటాను. కొంతమందికి నచ్చవచ్చు.కొంతమందికి నచ్చకపోవచ్చు.కానీ నా మంత్రివర్గంతో, మేము నిర్ణయాలు తీసుకునే ముందు చాలా సుదీర్ఘంగా చర్చలు జరుపుతాము.అత్యంత ప్రజాస్వామ్య పద్ధతిలో మేము పనిచేస్తున్నాం''.అని కేసీఆర్ జవాబిచ్చారు.ఆయన ఏ విధంగా 'ప్రజాస్వామిక పద్దతి'లో పరిపాలించారో ఆ పార్టీ నాయకులకు,ఆ పార్టీ నుంచి వెలుపలికి వచ్చి,వేరే పార్టీలో చేరిన వారికి,మాజీ మంత్రులందరికీ అనుభవం ఉన్నది.ఆ పార్టీలో నాయకత్వం ఎలా కేంద్రీకృతంగా వ్యవహరించిందో,ప్రశ్నించిన వారిని ఎలా అణచివేసిందో ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వంటి వాళ్లకు బాగా తెలుసు.

'బెంగాల్ లాగా మన దగ్గర మమతా బెనర్జీ లేదు. తెలంగాణలో కేసీఆర్‌కు సరితూగే నాయకుడు మన పార్టీలో లేరు' అని మూడేండ్ల కిందట బెంగాల్ ఫలితాల అనంతరం బీజేపీ జాతీయ నాయకత్వం అభిప్రాయపడింది.బీజేపీకి సంబంధించి నాయకత్వ సమస్య ఒక మైనస్ పాయింటు.కానీ కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కేసీఆర్ కు సరితూగే నాయకునిగా అవతరించడం చూస్తున్నాం.తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పిన వ్యక్తి రేవంత్. ఆయన నాయకత్వాన్ని ఒప్పుకున్నా,ఒప్పుకోకపోయినా ఇది అక్షరాలా నిజం.'పేస్ ఆఫ్ ద తెలంగాణ కాంగ్రెస్ 'గా ఆవిర్భవించిన మూడేండ్లకే 'పేస్ ఆఫ్ ద తెలంగాణ'గా మారడం రాజకీయాల్లో సంభవించే అరుదైన సన్నివేశం.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004 లో చంద్రబాబు కాకుంటే ఎవరు? అని ప్రజలు ప్రశ్నించుకున్నప్పుడు వారికి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రత్యామ్నాయంగా కనపడ్డారు.2019లో ఏపీలో చంద్రబాబు కాకుంటే ఎవరు అనుకున్నప్పుడు జగన్ కనపడ్డారు.2024లో జగన్ కాకుంటే ఎవరు అనుకుంటే,మళ్లీ చంద్రబాబు కనపడ్డారు.అలాగే తెలంగాణలో కేసీఆర్ కాకపోతే ఎవరు? అనే ప్రశ్నకు రేవంత్ రెడ్డిని జనం ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారు.ఇందులో ఎలాంటి గారడీ లేదు.చేతబడి విద్య కూడా కాదు.

తెలంగాణకు కేసీఆర్ మినహా మరో దిక్కు లేదని ప్రజల మనస్సులో టిఆర్ఎస్ పార్టీ బలంగా నాటింది.ఆ అభిప్రాయాన్ని కూకటివేళ్లతో పేకించడం రేవంత్ రెడ్డి వల్లనే సాధ్యమైంది.కేసీఆర్‌ని ఎదుర్కోవాలంటే ఆయనలాగే ఆలోచించాలి.ఆయనలాగే వ్యూహాలు రచించాలి. ఆయన లాగే ఎత్తుగడలు వేయాలి.కేసీఆర్ కు సమఉజ్జీగా,ఆయనతో సరితూగే బలమైన నాయకునిగా రేవంత్ రెడ్డి చాలా తక్కువ కాలంలో తయారయ్యారు.ఆయన పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచీ 'కేసీఆర్ తో చేయబోయే యుద్ధం'కోసం ఎంతో శ్రమ కోర్చి అభ్యాసం చేయడం వలన రేవంత్ 99 శాతం స్ట్రైకింగ్ రేట్ సాధించగలిగారు.కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత తమకు అధికారం సాధించి పెడుతుందని ఇంట్లో కూర్చుంటే విజయం వరించేదే కాదు.

ఇదిలా ఉండగా ''బీఆర్ఎస్ రాష్ట్రంలో ఎక్కడుంది? బీజేపీతోనే మాకు పోటీ.బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పని చేస్తున్నది.కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయిలో అనుమానాస్పదంగా మృతి చెందితే కేటీఆర్ ఎందుకు స్పందించలేదు?విచారణ కోరతారా? లేదా? కాళేశ్వరం కేసులు వాదిస్తున్న న్యాయవాది సంజీవ్ రెడ్డి,కేసు వేసిన రాజలింగమూర్తి,తాజాగా కేదార్ మరణాలపై కేసీఆర్ ఎందుకు విచారణ కోరడం లేదు?త్వరలోనే డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది.ప్రభుత్వానికి ఫిర్యాదు వస్తే మేము విచారణ చేపడతాం.కేదార్ తో పాటు దుబాయ్‌లో అదే ఫ్లాట్ లో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎవరు''? అని ఢిల్లీలో బుధవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరుల ఇష్టాగోష్టిలో వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ క్రమంగా బలహీనపడుతున్న సంకేతాల నేపథ్యంలోనే 'తెలంగాణలో బీజేపీకి తమకు మధ్యనే పోరాటం'గా ముఖ్యమంత్రి నిర్వచించడం విశేషం.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడానికి బిఆర్ఎస్ దగ్గర సహేతుకమైన కారణాలేమీ లేవు.పైగా ఈ అంశాన్ని రేవంత్ అద్భుతంగా తమకు అనుకూలంగా మలచుకున్నారు.''బిఆర్ఎస్ ను విలీనం చేసుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తున్నది.రెండు పార్టీలు అవగాహనతో పనిచేస్తున్నవి.కేటీఆర్,హరీశ్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీ కాళ్లపై పడ్డారు'' అంటూ సీఎం రేవంత్ రెడ్డి అటాక్ చేశారు.రేవంత్ ను అప్రదిష్ట పాల్జేయాలని,రాజకీయంగా దెబ్బతీయాలని బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తుండగా,వారిని రేవంత్ సులభంగా ఇరుకున పెడుతున్నారు.బిఆర్ఎస్ తరచూ ఆత్మరక్షణలో పడుతోంది.దాన్ని కప్పిపుచ్చుకోవడానికి గాను రేవంత్ ను బిజెపి రక్షిస్తోందంటూ కేటీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు.కానీ కేటీఆర్,హరీశ్ ప్రకటనలు పెద్దగా ప్రభావం చూపడం లేదు. నిర్మాత కేదార్ మృతి మిస్టరీపై స్పందించిన రేవంత్ 'కేదార్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి' అని ఢిల్లీలో చెప్పారు.కేదార్ హైదరాబాద్ ర్యాడిసన్ హోటల్ లో డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ఆయన దుబాయిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేగుతోంది.

# శివాలయంలో మంత్రి ఉత్తమ్ దంపతులు ప్రత్యేక పూజలు



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 26,మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజక వర్గం మేళ్లచెరువు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఇష్ట కామేశ్వరి సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో మంత్రి ఉత్తమ మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన ఈ దేవాలయంకు ప్రభుత్వం నుండి కోటి రూపాయల నిధులను ఇవ్వడం జరిగిందని రానున్న రోజుల్లో దేవాలయాన్ని మరియు మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తానని సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని శివయ్య ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని వారిని చల్లగా దీవించాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అన్నారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే కోదాడ వేనేపల్లి చందర్రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు భక్తులు పాల్గొన్నారు.

# హర హర.. శంభో శంకర

- ములుగు జిల్లా వ్యాప్తంగా వైభవంగా శివజాగరణ ఉత్సవాలు
- తెల్లవారుజామున ప్రారంభమైన అభిషేకాలు, పూజలు
- ప్రధాన ఆలయాల్లో కొనసాగిన భక్తుల రద్దీ



**ములుగు, మహా :** ములుగు జిల్లా వ్యాప్తంగా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పెద్ద ఎత్తున శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని వెంకటాపురం మండలం పాలంపేటలో గల యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి జల, క్షీర, పుష్పాభిషేకాలు నిర్వహించి భోళా శంకరుని కొలుచుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు. తాగునీటిని అందుబాటులో ఉంచారు. వివిధ స్టాల్స్ఏర్పాటు చేశారు. శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు సాంప్రదాయ బద్ధంగా తరలివచ్చారు. ములుగులోని నగరేశ్వరాలయంతో పాటు గోవిందరావుపేట, మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం శివజాగరహణ మహోత్సవాల్లో భాగంగా పలువురు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. భక్తుల రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. రామప్పలో డీఎస్పీ రవీందర్ సూచనల మేరకు సీఐ శంకర్, ఎస్సై సతీష్, ములుగులో ఎస్సై వెంకటేశ్వర్ రావు ఆలయాల వద్ద బందోబస్తు నిర్వహించారు. ఇటు శివరాత్రి, తెల్లవారే ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో పోలీసులు విధుల్లో నిమగ్నమయ్యారు. ములుగులోని శివాలయంలో సాయంత్రం నుంచి తెల్లవారు జాము వరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.






# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం

- 6 రూట్లలో 9 పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సామాగ్రి
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు, మహా :** ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని, సిబ్బంది పోలింగ్ సామాగ్రిని సక్రమంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులకు సూచించారు. ఆరు రూట్లలో జిల్లాలోని 9 కేంద్రాలకు పోలింగ్ సామాగ్రిని తరలించినట్లు వెల్లడించారు. బుధవారం ములుగులోని కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి వితరణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సంద్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా 628మంది ఓటింగ్ లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి, భోజన వసతి ఏర్పాటు చేయాలని, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. పీవో, ఏపీవో, ఓపీవోలతో కూడిన బృందాలన్నీ పర్యవేక్షిస్తారని, కేంద్రాల వద్ద 144సెక్షన్ పక్కాగా అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సిహెచ్.మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్-2024 సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో గ్రేటర్ వరంగల్ కు 4వ ర్యాంకు

**వరంగల్, మహా;** స్వచ్ఛ సర్వేక్షణ్2024 (ప్రస్తుతం) సిటిజన్ ఫీడ్ బ్యాక్ విభాగం (పౌరుల స్పందన) జాతీయ స్థాయి లో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు అత్యుత్తమంగా 4వ స్థానం దక్కింది. దేశవ్యాప్తంగా టాప్ 100 యు ఎల్ బి లు సిటిజన్ ఫీడ్ బ్యాక్ లో సాధించిన స్కోరు ఆధారం గా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ర్యాంకుల్లో గ్రేటర్ వరంగల్ కు 33,833 మంది నగర వాసులు బల్దియా అందిస్తున్న సేవల పై సానుకూలంగా స్పందించి అభిప్రాయాలు తెలియజేసిన నేపథ్యం లో గ్రేటర్ వరంగల్ ఉత్తమ ర్యాంకు లో కొనసాగుతుంది. బల్దియా కంటే ముందు వరుసలో ఆంధ్ర ప్రదేశ్ నుండి విజయవాడ విశాఖ పట్నం తో పాటు మహారాష్ట్ర నుండి పింప్రి చించ్వాడ్ తొలి మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

**నగర ప్రజలు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే**



సిటిజన్ ఫీడ్ బ్యాక్ లో నగరానికి 4 వ స్థానం దక్కడం పట్ల కమిషనర్ హర్షం వ్యక్తం చేస్తూ మార్చి మొదటి వారం వరకు ఫీడ్ బ్యాక్ ఇవ్వవచ్చునని ఇందులో పెద్ద సంఖ్యలో నగర వాసులు పాల్గొని ఈ విభాగం లో మొదటి స్థానం దక్కేలా అభిప్రాయాలు అందజేయాలని తద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్2024 లో ఉత్తమ ర్యాంకు సాధనకు ఫీడ్ బ్యాక్ దోహదం చేసే అవకాశం ఉంటుందని కమీషనర్ తెలిపారు.

# శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- మహాశివరాత్రితో శివాలయాలకు భక్తుల తాకిడి
- శివాలయంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పూజలు
- జిల్లాలో ప్రసిద్దిగాంచిన నందివనపర్తి నందీశ్వరాలయం



**రంగారెడ్డి జిల్లా, మహా:** మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. బుధవారం నంది వనపర్తిలోని నందీశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆ పరమశివుని దర్శించుకున్న ఎమ్మెల్యేల మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని అతి పురాతనమైన శివాలయంగా గుర్తింపు పొందిన, నందీశ్వరాలయం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండలం, నంది వనపర్తి గ్రామంలో నెలకొంది. ఈ ఆలయానికి ప్రత్యేకతలు అనేకం. ఈ గ్రామంలో అడుగడుగునా నంది విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. ఆ కారణంగానే ఈ గ్రామం పేరు నంది వనపర్తిగా వచ్చింది. ఇక్కడి ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా మండలాలు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, శివనామ స్మరణలో మునిగిపోతారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మిక సేవాగుణం కలిగి ఉండాలి. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని, రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుని కోరడం జరిగిందని తెలిపారు. దైవ భక్తిలో ఉన్న ప్రశాంతత స్వేచ్ఛ మరి ఎక్కడ దొరకదని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆ పరమశివుని దైవానుగ్రహంతో ప్రతి పని చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయంగా శ్రీ నందీశ్వరాలయం పేరుగాంచింది. ఇక్కడికి జిల్లాల నుంచి భక్తులు తండోపతండాలుగా చేరుకొని వాళ్ల కోరికలు కోరుకొని, నెరవేరిన తర్వాత ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు సమర్పించుకుంటారు. ఇంతటి మహోత్తరమైన దేవాలయం దేవాలయానికి ఈ మహాశివరాత్రి సందర్భంగా మేము రావడం చాలా సంతోషంగా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. నందీశ్వర ఆలయం మొత్తం భక్తులతో కిటకిటలాడుతుంది. వేలాదిగా వచ్చి భక్తులు ఆ పరమశివుని దర్శించుకుని ఒక్కపొద్దులు విడుస్తున్నారు. సమయం గడిసెకొద్దీ ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు చెప్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, పిఎసిఎస్ ఉప్పరగూడ చైర్మన్ పాండురంగ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల రాజశేఖర్ రావు, మంచాల పిఎసి చైర్మన్ హనుమంత్ రెడ్డి, యాచారం మండలం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, నందు వనపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బిలకంటి శేఖర్ రెడ్డి, జిల్లా మండల పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, భక్తులు పలువురు పాల్గొన్నారు.


# సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకుందాం

- ఉత్సవ కమిటీ కన్వీనర్ తులసి రామ్ నాయక్



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 26 మహా:** బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు 28/02/2025 న హుజూర్ నగర్ పట్టణంలో నిర్వహిస్తున్నందున మట్టంపల్లి మండల కేంద్రంలో జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు ధరావత్ నవీన్ నాయక్ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్,కో కన్వీనర్,తులసి రామ్ నాయక్, సైదులు నాయక్ లు, మాట్లాడుతూ మఠంపల్లి మండలంలోనీ గిరిజన బిడ్డలు పార్టీ లకు అతీతంగా గిరిజన మాజీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు లాయర్లు డాక్టర్లు గిరిజన మేధావులు కార్మికులు కర్షకులు విద్యార్థులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బానోతు భాస్కర్ నాయక్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బాబు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాముడు, విటి నాయక్ సిపిఎం నాయకులు పాండు నాయక్,యూత్ కాంగ్రెస్ ప్రేమ్ నాయక్, యంకు, బాలు, మోహన్ వంకడోతు గోవింద్ నాయక్, ,శ్రీను నాయక్, నాగేశ్వరావు నాయక్, సిరి హాస్పిటల్ నాగు నాయక్, రవీందర్ నాయక్ మోహన్, బాలాజీ,నాగరాజు చంటి, కోటేష్,నాయక్, సంతోష్ పాల్గొన్నారు.

# శివాలయంలో ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక పూజలు



**హనుమకొండ, మహా;** హనుమకొండ జిల్లా హాసన్ పర్తి మండల పరిధిలోని సిద్ధాపురం గ్రామ కత్తెరశాల మల్లికార్జున స్వామి దేవాలయం లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజల తోపాటు అభిషేకాలు నిర్వహించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తో కలిసి వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షుడు దిలీప్ రాజ్ మొదటగా శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పట్నాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుంప సోమేశ్వరాలయంలో.. ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు



**పార్వతీపురం, మన్యం జిల్లా మహా :** కొమరాడ మండలంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి గుంప గ్రామంలో నాగవళి, జంఝవతి ఏటిల సంగమంలో స్వయంభుగా వెలసిన సోమేశ్వరుని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరుని అనుగ్రహంతో నియోజకవర్గంలోని ప్రజలందరి జీవితాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోమేశ్వరుని దర్శనానికి క్యూ లైన్ లో ఉన్న భక్తులకు వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్యే గారి వెంట మండల పార్టీ అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, రాఘవ, కోలా రంజిత్ కుమార్, కొండయ్య, అనిల్, తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాటర్ నీళ్లకు తేడా తెలియని మంత్రి కోమటిరెడ్డి

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మున్సిపల్ కొటర్లోవాటర్ కలిపితాగిన తరువాత వాటర్, నీళ్లు ఒకేలా కనిపిస్తాయని. మంత్రి వెంకట్ రెడ్డి నిన్న మాట్లాడినతీరులాగే ఉంది అని కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. ఎస్ ఎల్ బి సి లో జరిగినప్రమాదానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పూర్తిబాధ్యత వహిస్తూ తనపదవికిరాజీనామా చేయాలన్నారు.పాలకులు ప్రజల కోసం కాకుండా పదవులకోసమే అన్నట్టు పరిపాలన సాగిస్తున్నారు.ముఖ్యమంత్రికి పాలనమీదపట్టులేదు. సంక్షేమపథకాలపైఊహాగహనలేదు. మంత్రులకు బాధ్యతలేదు. ఎమ్మెల్యే లను అయితేఇప్పటికేగ్రామల్లో తరుమూతున్నారన్నారు .. ఇప్పుడున్నపరిస్థితుల్లో ఆంధ్రపాలకులుచేసిన నష్టంకంటే తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్ననష్టమే ఎక్కువన్నారు.తుంగతుర్తి నియోజకవర్గంలో పరిస్థితి ఇంకాఅధ్వానంగా ఉందన్నారు. గతప్రభుత్వం మాజీ శాసనసభ్యులు కిషోరన్న చేసినఅభివృద్ధి. తెచ్చిన నిధులు తప్పాకొత్తగా చేసిందిఏమీలేదాన్నారు. ఉంటే బహిరంగచర్చకు సిద్ధమా అని డిమాండ్ చేశారు.

# చిన్నవంగరలో ఎర్రబెల్లి ప్రత్యేక పూజలు



**మహబూబాబాద్,మహా ;** మహా శివరాత్రి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలోని ప్రాచీన శివాలయాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ పురాతన దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన, పరమశివుని కృపకు ముగ్ధుడయ్యారు. స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేకంగా అభిషేకం, అర్చన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన భక్తులతో కలిసి శివనామస్మరణలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భక్తులకు ఆశ్రయం కల్పించే ఈ పవిత్ర శివాలయం ఎంతో విశిష్టత కలిగినదని, ఇక్కడ పూజలు నిర్వహించడం ద్వారా మనసుకు అపారమైన ఆనందం కలుగుతుందన్నారు.మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, భగవంతుని కృప అందరి మీద ఉండాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నవంగర శివాలయం ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయమని, దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, ప్రత్యేక హోమాలు, అన్నదానం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మంచినీటి కొరత లేకుండా చూడాలి



**పార్వతీపురం, మన్యం జిల్లా మహా :** కొమరాడ మండల కేంద్రంలో వాసవి దృష్టిలో పెట్టుకొని అన్ని గిరిజన గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన మంచినీటి సౌకర్యం కల్పించి గిరిజన ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొమరాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సాంబమూర్తి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు ప్రసాదు చెంబరు మాట్లాడుతూ ఇప్పటికే వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా కొమరాడ మండలంలో పెద్ద శాఖ పంచాయతీ పరిధిలో జల గు జ్జబడి ధరసంగి బెడ్డ పూషనంది గ్రామాల్లోనూ మరియు కుంతేసు పంచాయతీ కే చెందిన తిను కు గూనకల్లు వానబడి బద్దిడి గొర్లెమ్మ మరియు పూడేస్ పంచాయతీ కి సంబంధించి తీలేసు గ్రామంలోనూ మరియు చోళ పదం పంచాయతీ రెబ్బ వనధార గ్రామాల్లోనూ నయా పంచాయతీ గుడ్డ సంకే సు లోడ్డ వన కాబడి గ్రామాల్లోనూ గుణద తీలే సు పంచాయతీ పరిధిలో బిన్నిడి గుణద తీలే సు ఎగువ గుణద దిగువ గుణద గ్రామాల్లో నీటి కొరత కొంతవరకు బాగా ఉందని కాబట్టి వెంటనే ఐటీడీఏ అధికారులు మరియు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని అన్ని గిరిజన గ్రామాలకు పుష్కలంగా వేసవి దాటే వరకు నీరు అందించే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజన గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా తెలియజేయుచున్నాము.

# భక్తుల ప్రత్యేక పూజలు

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు రామలింగేశ్వర ఆలయంలో దర్శనానికి వచ్చిన భక్తులు క్యూ పద్ధతిలో పాల్గొని భక్తులు శివనామస్వరంతో పరవశించి పోయారు, శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, చెల్లించుకుంటున్నారు. అని ఆలయ కమిటీ అధ్యక్షుడు రామచంద్ర గౌడ్, భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని అన్నారు,



# మధిరలో భట్టి ప్రత్యేక పూజలు



**మధిర ఫిబ్రవరి 26 మహా :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క మధురలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా సతీసమేతంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మృత్యుంజయ స్వామి దేవస్థానానికి వచ్చారు ఆలయ పూజారులు ఆయనకు ప్రత్యేక స్వాగతం పలికారు స్వామివారికి సతీ సమేతంగా ప్రత్యేక అభిషేకాలు నాయన నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు రాహుల్ గాంధీ దేశ ప్రధానిగా రాబోయే రోజుల్లో కావాలని కాంగ్రెస్ పాలనతోనే దేశంలో సుభిక్షమైన పాలన అందుతుందని ఆయన అన్నారు అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించే ఈ ఐదు రోజులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు

# రాజన్న గుడికి బీఆర్ఎస్ చేసింది శూన్యం

## నాడు రూ.100 కోట్లు ఇస్తానని మోసం.. కవితవన్నీ కాకమ్మ కబుర్లే.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫైర్

**మహా, వేములవాడ:** మహాశివరాత్రిని పురస్కరించుకుని వేములవాడ రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలన్నీ కాకమ్మ కబుర్లే అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కవిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ పది సంవత్సరాల పరిపాలనలో రాజన్న గుడికి చేసింది ఏమీ లేదని, కేసీఆర్ తో పాటు తన లగ్గం కూడా ఇక్కడే అయిందని ఆమె చెప్పడం సిగ్గు చేటన్నారు. రాజన్న ఆలయానికి ఏటా రూ.100 కోట్లు ఇస్తానని భక్తులను మోసం చేశారని అన్నారు. ఆలయ అభివృద్ధికి బడ్జెట్‌లో ఏనాడూ అణాపైసా కేటాయించలేదని, తాము బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని ఏనాడూ చెప్పకుండానే రూ. 50 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. కవిత ఎవరో చెప్పిన స్క్రిప్ట్ చదివారని, మహాశివరాత్రి వచ్చిందంటే వారు రంగు రంగు బ్రోచర్లతో రాజన్న భక్తులను మోసం చేశారని గుర్తు చేశారు. తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి నిర్మాణానికి కనీసం భూ సేకరణ చేయకుండానే వాటిని నిర్మించినట్లు గ్రాఫిక్స్ లో చూపించారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించడం జరిగిందని, రూ. 47 కోట్లతో వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు చేపడుతున్నామని అన్నారు. గుడి చెరువులో, మూలవాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వచ్చే మహా శివరాత్రి వరకు రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక అందజేసిన సమయంలో ఆలయ విస్తరణ పనులపై ఆరా తీశారని, గత ప్రభుత్వంలాగా పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. తమపై అనవసరమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



### దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై

# జీవితకాల నిషేధం అవసరంలేదు

## సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం

### ఆరేళ్ల నిషేధం సరిపోతుందని స్పష్టం

**మహా :** క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవిత కాల నిషేధం చాలా కఠినమైనదని, ప్రస్తుతం ఉన్న ఆరేళ్ల అనర్హత సరిపోతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు భారత అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రస్తుతం ఉన్న ఆరేళ్ల నిషేధం సరిపోదని, క్రిమినల్ కేసులు ఉన్న రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని కోరుతూ అశ్విని ఉపాధ్యాయ్ అనే న్యాయవాది పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కేంద్రం అభిప్రాయం కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈరోజు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. జీవితకాల నిషేధం అత్యంత కఠిన చర్య అని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ఆరేళ్ల నిషేధం సరిపోతుందని అఫిడవిట్‌లో పేర్కొంది. క్రిమినల్ కేసులలో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాలం నిషేధం విధించాలా? ఆరేళ్ల నిషేధం విధించాలా? అనేది పార్లమెంటు పరిధిలోని అంశమని కేంద్రం తన అఫిడవిట్‌లో పేర్కొంది. పార్లమెంటు ఇప్పటికే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆరేళ్ల నిషేధం విధించిందని సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే దీనిపై సుప్రీంకోర్టు తుది నిర్ణయాన్ని వెలువరించాల్సి ఉంది.

# స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ మోసం


### కుంభమేళాలో పవిత్ర స్నానం చేద్దామనుకున్నారు


### కానీ పాపం ఇంకా ఎయిర్‌పోర్ట్‌లోనే..!




శంషాబాద్ డొమెస్టిక్ ఎయిర్ పోర్ట్‌లో ప్రయాణీకుల ఆందోళనకు దిగారు. హైదరాబాద్ - శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఉదయం ఎనిమిది గంటలకు వెళ్లాల్సిన విమానం ఇప్పటికీ రాకపోవడంతో ప్రయాణికులు ఆందోళన బాట పట్టారు. మహాశివరాత్రి కావడంతో ఉపవాస దీక్షలతో ఉన్న ప్రయాణికులు పుణ్యస్నానాలు అచరించేందుకు వారణాసి వెళ్లేందుకు ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు భక్తులు. బోర్డింగ్ పాస్ తీసుకుని లోపలికి వెళ్లారు. చివరి నిమిషంలో ఫ్లైట్ సాంకేతిక సమస్యలు తలెత్తాయంటూ సమాచారం ఇచ్చారు. దీంతో ప్రయాణికుల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ సిబ్బంది సరియైన సమాధానం ఇవ్వకపోవడంతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నాలుగుంటలకు పైగా నిరీక్షణ, ఆందోళనల తర్వాత ఎయిర్ లైన్స్ స్పందించింది.







# ఇషాలో.. అద్భుతంగా వేడుకలు

ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సద్గురు ఆదియోగిలో నిర్వహించిన అద్భుత వేడుకలకు దేశవ్యాప్తంగా భక్తులు తరలిరాగా, కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ హాజరయ్యారు. అమిత్ షా వేడుకలు ప్రారంభించారు.



# విజయ డైరీ పాలపై చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి కీలక ప్రకటన

## విజయ తెలంగాణ అని బ్రాండ్ ఉంటేనే పాలను కొనుగోలు చేయండి

### మార్కెట్లో నకిలీ బ్రాండ్ లు




**హైదరాబాద్, మహా :** కొంతమంది ప్రైవేట్ డైరీ వారు విజయ పేరుతో తమ విజయ తెలంగాణ పాల ప్యాకెట్లను విక్రయిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని.. అలాంటి పాలను కొనుగోలు చేయవద్దని తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాలాపేట్‌లోని విజయ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి మాట్లాడారు. ప్రజలు విజయ తెలంగాణ అని బ్రాండ్ ఉంటేనే పాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా తెలంగాణ నకిలీ పాలను డిస్ట్రిబ్యూటర్స్ వెండర్స్ కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే తాము కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఇలాంటి నకిలీ విజయ పాలతో వచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఇవి ప్రజల ఆరోగ్యానికి సంబంధించినవి కాబట్టి తమ లోగోను పరిశీలించి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# శివ నామస్మరణతో మార్మోగిన వేములవాడ రాజన్న ఆలయం

## అంగరంగ వైభవంగా మహాశివరాత్రి జాతర ఉత్సవాలు.. భారీగా హాజరైన భక్తజనం



**మహా :** పేదల దేవుడిగా పిలవబడే రాజన్న దర్శనానికి రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. పిల్లాపాపలతో జాతరకు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. రాజన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, జాగారాలు ఉండేందుకు భక్తులు చేరుకున్నారు. వీరంతా రాజన్న గుడి చెరువు ప్రదేశంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద బస చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, బస్సులు, విద్యుత్ దీపాలతో అలంకరణ, భక్తులకు త్వరగా దర్శనం కల్గించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాజన్నకు ప్రభుత్వం తరపున రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి, విప్‌కి స్వాగతం పలికారు. అంతకుముందు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో డిప్యూటీ ఈవో లోకనాథం, అర్చక బృందం సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. శృంగేరి శారదా పీఠం తరఫున రాధాకృష్ణ శర్మ స్వామివారికి పట్టువస్త్రాలతో పాటు రుద్రాక్షమాలను సమర్పించారు. ఆలయ గుడి చెరువు మైదానంలో ఏర్పాటు చేసిన శివర్చాన కార్యక్రమాన్ని మంత్రి, విప్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

### ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నా..

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన తర్వాత ఆయన మాట్లాడుతూ మంత్రులందరం ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడె మొక్కు వేములవాడలోనే ఉందన్నారు. రూ.76 కోట్లతో ఆలయ విస్తరిస్తున్నామన్నారు. మహాశివరాత్రి జాతర పనులు ప్రారంభిస్తామన్నారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు రవాణా, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు రాజన్న భక్తులకు ఉచిత అల్పాహారాన్ని, వైశ్య సత్రం తరపున అన్నదానంతో పాటు 14 ఉచిత బస్సులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ జాతర ఏర్పాట్లను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఆలయ ఈవో వినోద్రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఈఈ రాజేశ్, టౌన్ సీఐ వీరప్రసాద్ ఉన్నారు.

### మహాలింగార్చన..!

శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు అనువంశిక అర్చకులు మహాలింగార్చన, దర్శనం, రాత్రి 11.35 లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొనాలనుకునేవారు భీమేశ్వరాలయంలో అభిషేకాలు నిర్వహించుకోవచ్చని అధికారులు తెలిపారు.

### రుద్రేశ్వరుడి కళ్యాణ మహోత్సవ వేడుకలో


# ఎమ్మెల్యే నాయిని దంపతులు

## స్వామి వారి కళ్యాణంకి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



**హనుమకొండ /వేయి స్థంబాల దేవాలయం:** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని నగరంలో మర్మోగిన శివోనామస్మరణం. వరంగల్ పశ్చిమని యోజకవర్గ పరిధిలో ప్రముఖ ఆధ్యాత్మిక, పురాతన దేవాలయం వేయి స్థంబాల దేవాలయంలో ఎంతో ఘనంగా శాస్త్రోపేతంగ జరుగుతున్న శ్రీ రుద్రేశ్వర స్వామి కల్యాణవేడుకలో సాయకాల వేల వరంగల్ పశ్చిమ నియోజకవర్గం గౌ. శాసనసభ్యులు శ్రీమతి శ్రీ నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి గారు పాల్గొన్నారు. కళ్యాణ వేడుక సందర్భంగా స్వామి వారికీ పట్టువస్త్రాలు సమర్పించారు. అసాంతం స్వామి వారి కళ్యాణ వేడుకను తిలకించి స్వామి కృపకు పాత్రులైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహా శివరాత్రి సమస్త ప్రాణకోటికీ ఉత్తమ ఫలితాలను అందించాలనీ,దేవ దేవుడి దివ్య ఆశీస్సులు ప్రజలకు కలగాలని కోరుకున్నారు.





### 9వ తరగతి విద్యార్థినిపై

# వృద్ధుడు లైంగిక దాడి

ఓ మైనర్ బాలికను మభ్యపెట్టి వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బుధవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నారాయణగూడ, కాచిగూడ చౌరస్తాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే 60 ఏళ్ల వృద్ధుడు, అతని ఇంటి సమీపంలో ఉన్న 9వ తరగతి చదివే బాలిక(14)పై కన్నేశాడు. ఆ బాలికకు మాయమాటలు చెప్పి అపార్ట్‌మెంట్‌లోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక భయాందోళనలతో ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించి ఆరా తీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికపై లైంగికదాడికి పాల్పడిన వృద్ధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను భరోసా సెంటర్‌కు పంపించి, స్టేట్‌మెంట్ ను రికార్డు చేయించారు. ఈ కేసులో రాజీ ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఈ కేసును ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

# మీరు హోమ్ లోన్ తీసుకుంటున్నారా?

## తక్కువ వడ్డీకి రుణాలు అందించే బ్యాంకులు!



మీరు లోన్ మీద ఇల్లు కొనాలని ప్లాన్ చేస్తుంటే మీకో శుభవార్త ఉంది. దేశంలోని 5 నుండి 6 ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే చౌకగా గృహ రుణాలు ఇస్తున్నాయి. చౌకగా ఇల్లు కొనడానికి మీకు మంచి అవకాశం ఉంది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) రెపో రేటును 0.25 శాతం తగ్గించిన తర్వాత ఈ బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించాయి.

ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) గృహ రుణాలపై ఫ్లోటింగ్ రేటును 0.25 శాతం తగ్గించింది. ఇప్పుడు 8.25 శాతం వడ్డీకి గృహ రుణం ఇస్తోంది. ఎస్‌బీఐ ఈ ఫ్లోటింగ్ రేటు ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రారంభ రేట్ల కంటే చౌకైనది. అదే సమయంలో ప్రైవేట్ రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ 8.75 శాతం వడ్డీ రేటుకు గృహ రుణాలను అందిస్తున్నాయి.

స్టేట్ బ్యాంక్ కంటే తక్కువ ధరలకు గృహ రుణాలు అందిస్తున్న బ్యాంకులు చాలా ఉన్నాయి. బ్యాంకుల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. ఫిబ్రవరి 2025 నాటికి ఎస్‌బీఐ కంటే తక్కువ ధరలకు గృహ రుణాలను అందిస్తున్న బ్యాంకులు కనీసం 6 ఉన్నాయి. ఈ బ్యాంకులలో ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఉంది. ఈ బ్యాంకు 8.1 శాతం వార్షిక వడ్డీ రేటుకు గృహ రుణం అందిస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి 20 సంవత్సరాలకు రూ.50 లక్షల గృహ రుణం తీసుకుంటే, నెలవారీ ఈఎంఐ రూ.42,133 అవుతుంది.

# ప్రైవేటుకు ఎయిర్‌పోర్టులు?

## వచ్చే ఏడాది మార్చినాటికి అమ్మేయనున్న కేంద్రం!

**న్యూఢిల్లీ :** విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్‌మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.

**ఇదీ సంగతి..**

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలీకట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంఫాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

**విమర్శలు వస్తున్నా..**

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ట్రాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025 26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన



బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్‌గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

# ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్

**న్యూఢిల్లీ :** ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకోవైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధిరేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

**ఇంకో 2 శాతం పెరగాలి**

ఈ ఆర్థిక సంవత్సరం (202425) మూడో త్రైమాసికం (అక్టోబర్‌డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలైసెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్‌డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి. మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే.



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL

# ఎమ్మెల్యేలూ.. ఓ కునుకేయండి

### కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు రిక్లైనర్ కుర్చీలు

### భోజనం చేశాక కునుకు తీసేలా కొత్త ప్లాన్

### కునుకు తర్వాత ఫ్రెష్ గా సభలో చర్చ చేయొచ్చు

### స్పీకర్ యు.టి.ఖాదర్ ఆసక్తికర ప్రతిపాదన



**మహా:** ఎమ్మెల్యేలూ.. ఓ కునుకేయండి. అసెంబ్లీకి వచ్చి సభలో కెమెరాల ముందు అనుకోకుండా కునుకుతీస్తే.. మీ ఎమ్మెల్యే సభకు వెళ్ళి నిద్రపోతున్నాడని నిందలపాలవుతున్నారు. మరోవైపు నియోజకవర్గాల నుండి బడలికగా.. సభకు వచ్చిన ఎమ్మెల్యేలు కునుకువస్తే ప్రజల ముందు పలుచనకావొద్దని లంచ్ తర్వాత తమ చర్చ లేకుంటే సభ నుండి వెళ్ళిపోతున్నారు. ఈ సమస్య నివారణకు కన్నడ నాట సభాపతి కొత్త ఆలోచన చేశారు. కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ యు.టి.ఖాదర్ చేసిన ఈ ఆసక్తికర ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చగా మారింది. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యేల సౌకర్యార్థం అవసరమైతే 15 రిక్లైనర్ కుర్చీలను అద్దెకు తీసుకుంటామని వెల్లడించారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఓ కునుకు తీద్దామని భావించే ఎమ్మెల్యేలు రిక్లైనర్ కుర్చీలను వాడుకోవచ్చన్నారు. అసెంబ్లీ హాలులోనే ఈ కుర్చీలను అందుబాటులో ఉంచుతామని స్పీకర్ ఖాదర్ తెలిపారు. సభకు ఎమ్మెల్యేల హాజరును పెంచాలనే ఏకైక లక్ష్యంతో ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు సకాలంలో సభకు హాజరై, ప్రతిరోజూ సెషన్ ముగిసే వరకు అందుబాటులో ఉండాలని సూచించారు. "ఏడాదిలో అసెంబ్లీ సెషన్ జరిగేది కేవలం 30 రోజులే. అలాంటి దానికి కొత్త రిక్లైనర్ కుర్చీలను కొనాల్సిన అవసరం లేదు. వాటిని అద్దెకు తీసుకుని, సెషన్ ముగియగానే వెనక్కి ఇచ్చేస్తాం" అని కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ ఖాదర్ తెలిపారు.

**ఉచితంగా అల్పాహారం, మధ్యాహ్న భోజనం**

ఇప్పటికే కర్ణాటక అసెంబ్లీ లో ఎమ్మెల్యేలకు ఉదయం 9 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని ఉచితంగా అందిస్తున్నారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం కోసం ఎమ్మెల్యేలు అసెంబ్లీ బయటకు వెళ్లి, తిరిగి ఆలస్యంగా అసెంబ్లీలోకి వస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఏర్పడకూడదనే ఉద్దేశంతోనే అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. 2023 జులైలో జరిగిన కర్ణాటక అసెంబ్లీ సెషన్‌లో కూడా ప్రయోగాత్మకంగా రిక్లైనర్ కుర్చీలను వినియోగించారు. వాటిని ఎమ్మెల్యేలు వినియోగించుకుని, ఎంతో సౌకర్యంగా ఫీలయ్యామని స్పీకర్ ఖాదర్‌కు ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. అందుకే ఇప్పుడు మరింత ఎక్కువ సంఖ్యలో ఆ కుర్చీలను అందుబాటులోకి తెచ్చేందుకు స్పీకర్ సిద్ధమయ్యారు. ఈ సౌకర్యం వల్ల ఎమ్మెల్యేల హాజరు, పనితీరు, ఉత్పాదకత పెరుగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ఎంపీగా అరవింద్ కేజ్రీవాల్?

## పంజాబ్ నుండి రాజ్యసభకు.. ఆప్ సంచలన నిర్ణయం



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో చావుదెబ్బతిన్న ఆప్ త్వరగా కోలుకునేందుకు మార్గాలు అన్వేషిస్తోంది. ఈ క్రమంలో పంజాబ్ మీదుగా పార్లమెంట్‌లోకి ప్రవేశించే ఎత్తుగడను కేజ్రీవాల్ రూపొందించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత సైలెంట్ అవుతారని భావించిన మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పార్టీ కన్వీనర్ హోదాలో క్రమం తప్పకుండా పార్టీ మీటింగ్‌లకు హాజరవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఆయన రాజ్యసభకు వెళ్లబోతున్నారంటూ ఓ ప్రచారం తెర మీదకు వచ్చింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘోర పరాజయం చవిచూసింది. మాజీ సీఎం కేజ్రీవాల్ కూడా ఓడిపోవడంతో ఢిల్లీ రాజకీయాలకు ఆయన శాశ్వతంగా దూరం అవుతారని, అందుకు 'లిక్కర్ స్కామ్' అవినీతి మరకే కారణమని విశ్లేషణలు నడిచాయి. ఈ కారణంగానే ప్రతిపక్ష నేతగా అతిషీని ఎంపిక చేశారని కూడా చర్చ జరిగింది. ఈ క్రమంలో.. పంజాబ్ లూథియానా వెస్ట్ నియోజకవర్గ ఉప ఎన్నికకు ఆప్ ఆశ్చర్యకరరీతిలో అభ్యర్థిని ఎంపిక చేసింది. కిందటి నెలలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే గురుప్రీత్ గోగి మృతి చెందారు. దీంతో.. రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోరాను ఆ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిగా బుధవారం ఆప్ ప్రకటించింది. సంజీవ్ అరోరా 2022లో ఆప్ తరఫున పంజాబ్ రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2028తో ముగియనుంది. దీంతో అరోరాను అసెంబ్లీకి పంపి.. ఆ ఎంపీ సీటును కేజ్రీవాల్‌కు అప్పజెప్పబోతున్నారన్నది ఆ ప్రచార సారాంశం. లూథియానా వెస్ట్ ఉప ఎన్నికకు ఈసీ ఇంకా షెడ్యూల్ ప్రకటించలేదు. అయితే ఆర్నెల్ల లోపు ఎన్నిక నిర్వహించాలన్న నిబంధన ప్రకారం.. జులై 11లోపు ఈ ఉపన్నిక జరిగే అవకాశం ఉంది.

# ఉక్రెయిన్‌కు అమెరికా షాక్

## ఐరాసలో రష్యాకు మద్దతుగా ఓటు



**న్యూయార్క్ :** ఉక్రెయిన్‌కు అమెరికా షాక్ ఇచ్చింది. ఐక్యరాజ్యసమితిలో రష్యాకు అనుకూలంగా ఓటు వేసింది. తమ దేశ భూభాగం నుంచి రష్యా వైదొలగాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐరాసలో ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అమెరికా, దాని మిత్రదేశాలు వ్యతిరేకంగా ఓటేశాయి. మరోవైపు చాలా యూరప్ దేశాలు తీర్మానానికి మద్దతు పలకడంతో అది ఆమోదం పొందింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాకు అనుకూలంగా అమెరికా ఓటేయడం ఇదే తొలిసారి. ఐరాస సాధారణ అసెంబ్లీలో ఈ తీర్మానానికి అనుకూలంగా 93 దేశాలు ఓటేయగా, 18 దేశాలు వ్యతిరేంచాయి. భారత్ సహా 64 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఇంకోవైపు ఈ తీర్మానంలో 'రష్యా దురాక్రమణ' అనే విషయాన్ని ప్రస్తావించకుండా చేయాలని అమెరికా చేసిన ప్రయత్నాన్ని ఐరాస తిరస్కరించింది.

## గోల్డ్ కార్డ్ ఆఫర్

# ప్రకటించిన ట్రంప్..

## 5 మిలియన్ల డాలర్లకే అమెరికా పౌరసత్వం !



**వాషింగ్టన్ డీసీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గోల్డ్ కార్డు ఆఫర్ ప్రకటించారు. సంపన్న శరణార్థులకు.. అమెరికా పౌరసత్వాన్ని ఇవ్వనున్నారు. కేవలం అయిదు మిలియన్ల డాలర్ల(సుమారు 44 కోట్లు)కే .. అమెరికా పౌరసత్వం వచ్చే ఛాన్సు ఉన్నది. గోల్డ్ కార్డుతో.. గ్రీన్ కార్డు రెసిడెన్సీ స్టాటస్ వస్తుందని, దీని ద్వారా విదేశీయులకు అమెరికా పౌరసత్వం పొందే మార్గం సులువు అవుతుందని తెలుస్తోంది. సుమారు 10 లక్షల గోల్డ్ కార్డులను మంజూరీ చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పౌరసత్వ కార్డుల ద్వారా వేగంగా జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని కొంత వరకు తగ్గించవచ్చు అన్న అభిప్రాయంలో ట్రంప్ ఉన్నారు. ఈబీ5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్డ్ కార్డు ఆఫర్లను ఇవ్వనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈబీ5 ప్రోగ్రామ్ ద్వారా అమెరికాలో పెట్టుబడి పెట్టే విదేశీయులకు గ్రీన్ కార్డు ఇస్తారు. గోల్డ్ కార్డులను అమ్మనున్నామని, ఆ కార్డుకు ధరను నిర్ణయిస్తామని, 5 మిలియన్ల డాలర్లకే ఆ కార్డును ఇవ్వనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.






## ఎన్టీఆర్ సినిమాలో ఛాన్స్?

బాలీవుడ్ గ్లామర్‌క్వీన్ ఊర్వశి రౌతేలా ప్రత్యేక గీతాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైంది. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాలో కూడా ఓ హుషారైన పాటలో నర్తించింది. ఇప్పటివరకు గ్లామర్ నాయికగానే తెలుగు ప్రేక్షకుల్లో ముద్రపడిపోయిన ఈ భామ పర్‌ఫార్మెన్స్ ప్రధానమైన పాత్రలపై దృష్టిపెడుతున్నదట. ఈ నేపథ్యంలో ఆమె ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ సినిమాలో కీలక పాత్రను పోషించే అవకాశం దక్కించుకుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. భారీ యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో కథానుగుణంగా పవర్‌ఫుల్ ఫీమేల్ రోల్ ఉం దట. ఈ పాత్ర లో ఊర్వశీ రౌతేలాను ఎంపిక చేశారని సమాచా రం. ఈ వార్త నిజమైతే ఊర్వశి రైతేలాకు కెరీర్ పరంగా మంచి బ్రేక్ దొరికినట్లేనని ఫిల్మ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. త్వరలో ఈ సినిమా షూట్‌లో ఊర్వశి జాయిన్ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ చిత్రానికి 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.


# RC16లో నా రోల్ స్పెషల్‌గా ఉంటుంది : శివరాజ్ కుమార్



కన్నడ చక్రవర్తి, సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ క్యాన్సర్ వ్యాధి నుంచి ఇప్పుడిప్పుడే పూర్తిగా కోలుకుంటున్నాడు. గత కొన్ని నెలలుగా శివరాజ్ కుమార్ క్యాన్సర్‌తో పోరాడుతున్న విషయం తెలిసిందే. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామీ క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ కోసం శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే ఆపరేషన్ అనంతరం శివరాజ్ కుమార్ క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నట్లు అతడి భార్య గీత శివరాజ్ కుమార్ జనవరి 1న వెల్లడించింది. ఇక క్యాన్సర్ నుంచి కోలుకున్న శివరాజ్ కుమార్ మార్చి నుంచి సినిమా షూటింగ్‌లను తిరిగి ప్రారంభించనున్నారు. ఇప్పటికే మార్చి 03 నుంచి #SRK131 అనే సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా.. ఈ చిత్రం అనంతరం రామ్ చరణ్ కథానాయకుడిగా రాబోతున్న #RC16 సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నారు. ఇది ఒక పాన్‌ఇండియా చిత్రంగా రూపొందుతోంది, బుచ్చిబాబు సానా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే తన అప్‌కమింగ్ సినిమాలకు సంబంధించి శివన్నా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడాడు. క్యాన్సర్ వ్యాధి నుంచి కోలుకున్న కూడా కొంత అలసటగా ఉంది. కానీ మెల్లిమెల్లిగా కోలుకుంటున్నాను. డాక్టర్లు కూడా ఒక నెల పాటు విశ్రాంతి తీసుకోమని సూచించారు. మార్చి నాటికి నేను పూర్తిగా కోలుకుని, రెట్టింపు ఉత్సాహంతో తిరిగి వస్తాను అని భరోసా ఇచ్చారంటూ శివరాజ్ కుమార్ చెప్పుకొచ్చాడు. ఇక రామ్ చరణ్ సినిమా గురించి శివన్న మాట్లాడుతూ.. మార్చి 5న హైదరాబాద్ వెళ్తున్నా. కొన్ని రోజుల పాటు రామ్‌చరణ్ సినిమా షూట్ లో పాల్గొంటా. ఈ చిత్రంలో నా పాత్ర ప్రత్యేకంగా ఉంటుంది అంటూ చెప్పుకొచ్చాడు.

# ప్రభాస్ - ప్రశాంత్ వర్మ కాంబో ఫిక్స్..!

హనుమాన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రస్తుతం 'జై హనుమాన్' సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇదే కాకుండా నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞతో ఒక సినిమా.. అలాగే ఇండియన్ ఫస్ట్ సూపర్ వుమెన్ ప్రాజెక్ట్ మహాకాళి అనే ప్రాజెక్టలను చేయబోతున్నాడు ప్రశాంత్ వర్మ. అయితే ఈ మూడు సినిమాలు కాకుండా తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి తాజాగా మరో సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ప్రశాంత్ వర్మ ఒక సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుండగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్క్రిప్ట్ పనులు జరుగుతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ ప్రాజెక్ట్ కోసం త్వరలోనే ప్రభాస్ లుక్ టెస్ట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఇక ఈ సినిమాను కన్నడ టాప్ బ్యానర్ హోంబలే ఫిలిమ్స్ నిర్మించబోతున్నట్లు టాక్. మైథలాజికల్ మూవీగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## నిర్మాత బన్నీ వాసుకు జనసేన కీలక బాధ్యతలు

ప్రముఖ నిర్మాత బన్నీ వాసుకు అరుదైన అవకాశం లభించింది. ఆయనకు జన సేన పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. మార్చి 14, 2025న జన సేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుగనుండగా.. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లలో ఆయన ప్రముఖ పాత్ర పోషించనున్నారు. జన సేన అధినేత పవన్ కళ్యాణ్ ఆయనను పబ్లిసిటీ అండ్ డెకరేషన్ ఇన్‌ఛార్జ్‌గా నియమించినట్లు సమాచారం. ఈ సభకు సంబంధించిన నిర్వహణ మొత్తం బన్నీ వాసు నేతృత్వంలో జరగనుందని తెలుస్తోంది. ఈ కీలక నియామకంతో జన సేన ఆవిర్భావ దినోత్సవ సభను గ్రాండ్‌గా నిర్వహించేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది. బన్నీ వాసు సినిమా నిర్మాణంలోని తన నైపుణ్యాన్ని, సంస్థాగత నైపుణ్యాలను ఈ ఈవెంట్ విజయవంతానికి ఉపయోగించనున్నారని అభిమానులు ఆశిస్తున్నారు.

# 18 కోట్ల రుణమాఫీ వివాదం

### కేరళ కాంగ్రెస్‌తో ప్రీతిజింటా క్లాష్



న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ అవినీతి కుంభకోణం నేపథ్యంలో కేరళ కాంగ్రెస్ పార్టీ తనపై చేసిన ఆరోపణలను బాలీవుడ్ నటి ప్రీతిజింటా ఖండించింది. బీజేపీ పార్టీకి మద్దతుగా నిలిచినందుకు ప్రతిఫలంగా న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ప్రీతిజింటా తీసుకున్న 18కోట్ల రుణాన్ని బీజేపీ మాఫీ చేసిందని కేరళ కాంగ్రెస్ సోషల్‌మీడియా వేదికగా ఆరోపణలు చేసింది. బ్యాంక్ ఖాతాదారులు తమ డబ్బుల కోసం రోడ్ల పైకి వస్తుంటే, ప్రీతిజింటా మాత్రం తన సోషల్‌మీడియా అకౌంట్లను బీజేపీకి అప్పగించి రుణాన్ని మాఫీ చేయించుకుందని కేరళ కాంగ్రెస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. వీటిపై ప్రీతిజింటా తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా స్పందించింది. పదేళ్ల క్రితమే తాను ఆ లోన్ మొత్తాన్ని చెల్లించానని, కేరళ కాంగ్రెస్ తనపై దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడింది. 'ఓ రాజకీయ పార్టీ నా ఫొటోలను ఉపయోగిస్తూ ఇలాంటి అబద్ధపు ప్రచారానికి దిగడం నన్ను షాక్‌కు గురిచేసింది. నా సోషల్‌మీడియా అకౌంట్లను నేనే చూసుకుంటాను. ఇలాంటి ఫేక్ ప్రచారాన్ని మానుకోండి.పదేళ్ల క్రితమే 18 కోట్ల లోన్‌ను చెల్లించాను. ఎలాంటి వివాదానికి ఆస్కారం లేకుండా నా పోస్ట్ అందరి సందేహాలను నివృత్తి చేస్తుందని భావిస్తున్నా' అని ప్రీతిజింటా ఎక్స్ ఖాతాలో పేర్కొంది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# ఇది చాలా స్పెషల్ గురు

## ఐసీసీ అవార్డులపై స్పందించిన టీమిండియా స్టార్ పేసర్!



భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన అద్భుతమైన ప్రదర్శనకు గాను ఐసీసీ గౌరవాలను అందుకున్నాడు. 2024లో అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బుమ్రా, "సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ"తో పాటు ఐసీసీ పురుషుల క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసీసీ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను అందుకున్నాడు. అంతేకాక, అతను ఐసీసీ టెస్ట్, టీ20I టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో చోటు సంపాదించాడు. పాకిస్థాన్‌తో భారత్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌కు ముందు, బుమ్రా దుబాయ్‌లో తన అవార్డులను స్వీకరించాడు. ఈ సందర్భంగా తన చిన్ననాటి హీరోలు గెలుచుకున్న ఈ అవార్డు తనకూ దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పాడు. "చిన్నప్పుడు ఈ ట్రోఫీని చాలా మంది దిగ్గజ ఆటగాళ్లు గెలుచుకున్నారు. ఇప్పుడు నేనూ అదే గౌరవాన్ని పొందడం చాలా ప్రత్యేకమైన అనుభూతి" అని బుమ్రా వ్యాఖ్యానించాడు. 2024లో బుమ్రా అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచాడు. టెస్టుల్లో 71 వికెట్లు తీసి అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్, USAలో జరిగిన పురుషుల T20 ప్రపంచకప్‌లో కూడా అతని ప్రభావం స్పష్టంగా కనిపించింది. తన అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను 11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ గెలుచుకునేలా చేశాడు. టెస్టుల్లో 14.92 సగటుతో వికెట్లు తీసిన బుమ్రా, బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ టూర్‌లలో తన దూకుడు చూపించాడు. T20 ప్రపంచకప్‌లో 4.17 ఎకానమీతో 15 వికెట్లు తీసి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. "మేము గెలిచిన T20 ప్రపంచకప్ ఎప్పటికీ ప్రత్యేకమే. 2024లో మా టీమ్‌కు అనేక అనుభవాలు ఎదురయ్యాయి. టెస్టులు ఎక్కువగా ఆడాం, కొత్త పరిస్థితులను ఎదుర్కొన్నాం. ఈ ప్రయాణం నాకు చాలా నేర్పింది. భవిష్యత్తులో కూడా మంచి ప్రదర్శనలు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఉన్నాను" అని బుమ్రా చెప్పాడు. ఈ ఏడాది ప్రారంభంలో వెన్నునొప్పి కారణంగా బుమ్రా కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే, మహ్మద్ షమీ గాయంతో దూరంగా ఉన్న సమయంలో బుమ్రా భారత్ బౌలింగ్ యూనిట్‌ను ముందుండి నడిపించాడు. షమీ తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత, అతని కమ్‌బ్యాక్‌పై బుమ్రా సంతోషం వ్యక్తం చేశాడు. "అతను చాలా కాలం గాయంతో బాధపడ్డాడు. కానీ ఇప్పుడు తిరిగి వచ్చి మళ్లీ తన బౌలింగ్ నైపుణ్యాన్ని చూపిస్తున్నాడు. అతను జట్టుకు మరింత సహాయపడతాడని ఆశిస్తున్నాను" అని బుమ్రా అభిప్రాయపడ్డాడు. భారత బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణిస్తోండగా, బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీలో తన జట్టుకు మరింత విజయాలు అందించాలని కోరుకుంటున్నాడు. అతని ప్రదర్శన భారత్ విజయంలో కీలకంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఆఫ్ఘనిస్థాన్ సంచలన విజయం

### ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇంగ్లండ్ ఔట్

### జో రూట్ సెంచరీ వృథా

ఇంగ్లండ్ ను 8 పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్థాన్ ఓడించింది. జో రూట్ సెంచరీ వృథా అయిన వేళ.. ఇంగ్లండ్ ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇంటి కెళ్లిపోయింది. ఆఫ్ఘన్ సెమీస్ రేసులో నిలిచింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ 5 వికెట్లతో ఆఫ్ఘన్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

**ఆఫ్ఘన్ సంచలనం**

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం సృష్టించింది. ఫేవరెట్స్ లో ఒకటిగా భావించిన ఇంగ్లండ్ ను ఇంటికి పంపించేసింది. గ్రూప్ బిలో భాగంగా బుధవారం (ఫిబ్రవరి 26) జరిగిన మ్యాచ్ లో ఇంగ్లండ్ ను 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. 326 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 317 పరుగులకే ఆలౌటైంది. ఆ టీమ్ స్టార్ బ్యాటర్ జో రూట్ (120) సెంచరీ చేసినా టీమ్ ను గెలిపించలేకపోయాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్ 5 వికెట్లతో ఇంగ్లండ్ ను దెబ్బతీశాడు. చివరి వరకూ పోరాడినా ఇంగ్లండ్ కు ఓటమి తప్పలేదు. ఈ ఓటమితో ఆ టీమ్ ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఔటైంది. ఇక గ్రూప్ బి నుంచి సెమీస్ బెర్తుల కోసం సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్ రేసులో ఉన్నాయి. ఇంగ్లండ్ భారీ స్కోరును కూడా చేజ్ చేసేలా కనిపించింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతున్నా.. జో రూట్ (120), బెన్ డకెట్ (38), కెప్టెన్ బట్లర్ (38), ఓవర్టన్ (32) పోరాడారు. దీంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకూ వెళ్లింది. కీలకమైన సమయంలో సెంచరీ వీరుడు జో రూట్ ఔటవడంతో ఇంగ్లండ్ కు ఓటమి తప్పలేదు.

**ఆఫ్ఘన్ భారీ స్కోరు**

అంతకుముందు ఇంగ్లండ్ కు చుక్కలు చూపించారు ఆఫ్ఘనిస్థాన్ బ్యాటర్లు. ఇబ్రహీం జద్రాన్ ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన వేళ ఆఫ్ఘన్ టీమ్ 50 ఓవర్లలో 7 వికెట్లకు ఏకంగా 325 రన్స్ చేసింది. ఒకదశలో 37 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ఆ టీమ్.. ఇంత భారీ స్కోరు చేయడం సాధారణ విషయం కాదు. జద్రాన్ 146 బంతుల్లో 177 రన్స్ చేశాడు. అందులో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉన్నాయి.

**ఇబ్రహీం జద్రాన్ షో**

ఇబ్రహీం జద్రాన్ దూకుడు మామూలుగా లేదు. అతడు ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్ గా నిలిచాడు. ఈ టోర్నీలో ఇంగ్లండ్ బ్యాటర్ బెన్ డకెట్ 165 పరుగులతో క్రియేట్ చేసిన రికార్డును జద్రాన్ బ్రేక్ చేశాడు.

## పంజాబ్ టోర్నీకి తెలంగాణ పోలీసు జట్లు

### కబడ్డీ, ఖోఖోల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం



పంజాబ్‌లో జరుగుతున్న జాతీయ పోలీసు స్పోర్ట్స్ మీట్ కోసం తెలంగాణ నుంచి కబడ్డీ, ఖోఖో బృందాలు బయల్దేరి వెళ్లాయి. రాష్ట్రం నుంచి మొత్తం 74 మంది పోలీసు క్రీడాకారులు అక్కడ జరిగే క్రీడల్లో పోటీపడుతున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో ఇప్పటికే ప్రతిభ కనబర్చిన రాష్ట్ర జట్లకు డీజీపీ జితేందర్ అభినందనలు తెలిపారు. పంజాబ్‌లోను పతకాలు కొల్లగొట్టాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐజీ రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చాంపియన్స్ ట్రోఫీ భద్రతా విధులకు నిరాకరణ..

### 100 మంది పోలీసులపై పాక్ ప్రభుత్వం వేటు



ఈ సారి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పొరుగుదేశం పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ దేశంలో ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన దాదాపు 100 మందికిపైగా పోలీసులపై అధికారులు వేటు వేశారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కేటాయించిన భద్రతా విధులను నిర్వర్తించేందుకు నిరాకరించిన కారణంగా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. పంజాబ్ పోలీసు అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. పలు సందర్భాల్లో వారికి కేటాయించిన విధులకు గైర్హాజరైనందుకు 100 మందికిపైగా పోలీసులను విధుల నుంచి తొలగించారు. 'చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్‌లోని గడాఫీ స్టేడియం నుంచి జట్లు బస చేసే హోటళ్ల వరకు ఆటగాళ్ల కోసం భద్రతను కేటాయించాం. అందుకోసం పోలీసు అధికారులను నియమించాం. అయితే వారిలో కొందరు విధులకు హాజరుకాలేదు. కొందరు బాధ్యతలను స్వీకరించడానికి పూర్తిగా నిరాకరించారు. ఎవరైనా సరే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పంజాబ్ ప్రావిన్స్ ఐజీపీ ఉస్మాన్ అన్వర్ స్పష్టం చేశారు. తొలగింపునకు గురైన వారంతా పోలీసు దళంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్నట్లు తెలిసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com